




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 9 సంచిక : 346 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | ఆదివారం 16 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :346 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | SUN 16 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


80 స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

# వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

## సీఎం చంద్రబాబు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం





- 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమరావతిలో సీఎం చంద్రబాబు ప్రసంగం
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన కోసం ఐక్యంగా పనిచేద్దామని పిలుపు
- గత పాలనలోని విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నామన్న సీఎం
- రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు, వచ్చే ఏడాది పోలవరం పూర్తిపై హామీ
- వివిధ శాఖల శకటాల ప్రదర్శన, ప్రతిభావంతులైన పోలీసులకు పతకాల ప్రదానం

## లోక్ భవన్‌లో గవర్నర్ ‘ఎట్ హోం’..

### సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు





- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా లోక్ భవన్‌లో ‘ఎట్ హోం’
- గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో తేనీటి విందు
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- పాల్గొన్న మంత్రులు, న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు
- గవర్నర్, ముఖ్యమంత్రి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు

వివరాలు 2లో..







# సప్తధార.. సంకల్పం

## ..ఇదే అభివృద్ధికి దిక్సూచి

## జెన్‌జీకి అధిక ప్రాధాన్యం

ప్రధాని మోదీ సరికొత్త నినాదం

- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్
- యావత్ ప్రపంచం ముందు మనకున్న సవాల్ ఇదే
- 140 కోట్ల మంది పౌరుల కృషి, ప్రయత్నంతో లక్ష్యాన్ని చేరుతాం.
- భారత్ ధైర్యానికి నిదర్శనంగా నిలవాలి
- 80వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం హైలైట్స్

వికసిత్ భారత్-2047 లక్ష్యసాధనకు ఏడు రంగాలే అభివృద్ధికి సప్తధారలని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ‘సప్తధార శక్తి’ పేరుతో ఉత్పాదకత నుంచి వ్యవసాయం, సాంకేతికత నుంచి రక్షణ, గ్రీన్ ఎనర్జీ నుంచి సాంస్కృతిక ప్రభావం వరకు ఏడు కీలక రంగాలపై దేశ భవిష్యత్ నిర్మాణాన్ని కేంద్రీకరిస్తున్నట్లు వెల్లడించారు. యువశక్తినే ఈ మార్పునకు ప్రధాన చోదకశక్తిగా పేర్కొంటూ.. 2047 నాటికి భారతన్ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

ఉత్పాదక రంగం వ్యవసాయ, ఆహార భద్రత సాంకేతికత, ఆవిష్కరణలు ఇన్ఫ్రాస్ట్రక్చర్, కనెక్టివిటీ శక్తి రక్షణ శక్తి గ్రీన్ ఎనర్జీ కల్చర్ ఇన్ఫ్యూయిన్స్, సాఫ్ట్ పవర్
ఈ ఏడు రంగాలు కలిసికట్టుగా పని చేసినప్పుడే 2047 నాటికి వికసిత్ భారత్ కల సాకారం అవుతుంది..
-వరేంద్ర మోదీ, భారత ప్రధాని

మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసే క్రెడిట్ తీసుకోండి
-విపక్షాలకు ప్రధాని మోదీ పిలుపు

## వికసిత్ భారత్..

2047 లక్ష్యంగా దూసుకెళ్తున్న దేశం

- యువతే... భారత్ బలం
- ఏడాదిలో కోటి మందికి ఏఐ శిక్షణ
- ప్రపంచ ఏఐ నాయకత్వం దిశగా భారత్
- 12 ఏళ్లలో ఆర్థిక శక్తిగా ఎదిగాం
- 2.5 లక్షలకు పైగా స్టార్టప్లు
- నక్సలిజంపై ఉక్కుపాదం




## వందేమాతరం గానంతో.. పులకించిన ఎర్రకోట

### మువ్వన్నెల జెండాతో ఉప్పొంగిన దేశభక్తి

- 13వసారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మోదీ
- ఆకాశం నుంచి పూలవాన.. స్వదేశీ ఫిరంగుల మోత
- కెప్టెన్ సోనియా చౌహాన్ నేతృత్వంలో త్రివిధ దళాల వందనం
- జ్ఞానపథంలో 2500 మంది కెడెట్ల అద్భుత ప్రదర్శన
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

# మనం అడ్రస్ లేనివాళ్లం కాదు.. మన కేరాఫ్ అడ్రస్ అమరావతి



- విజయవాడలో 80వ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని తమ విధానమని మరోసారి స్పష్టీకరణ
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని వెల్లడి
- కులమతాలకు అతీతంగా స్వర్ణాంధ్ర సాధన కోసం పనిచేద్దామని పిలుపు

పెన్ పవర్ డెస్క్:కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమష్టి కృషితో స్వర్ణాంధ్రను సాధించుకుందామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.

- మిగతా 2లో

# వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ తన పాత్ర పోషిస్తుంది

- కాకినాడలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పవన్ కల్యాణ్
- ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి భారత్ ఎదుగుతోందని వ్యాఖ్య
- వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడి
- కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టీకరణ

బలమైన, సమర్థవంతమైన దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాకినాడలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

- మిగతా 2లో





# ట్వీట్లతోనో, స్పీచ్ లతోనే ఆక్రమించలేరు..

## హర్మూజ్ జలసంధి ఇరాన్‌దే: ట్రంప్ ప్రకటనపై ఇరాన్ కౌంటర్

- హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానన్న ట్రంప్
- ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఇరాన్ మంత్రి కాజెమ్ గరీబాబాడీ
- హర్మూజ్ పై పూర్తి నియంత్రణ తమ చేతుల్లోనే ఉంటుందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:అంతర్జాతీయ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిపై అమెరికా, ఇరాన్ దేశాల మధ్య మాటల యుద్ధం ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చింది. ఇరాన్‌తో జరుగుతున్న పోరులో విజయం సాధించిన అనంతరం హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

- మిగతా 2లో

# అది మా గొంతును అణచివేసే ప్రయత్నమే



పెన్ పవర్ డెస్క్:కాక్రోచ్ జనతా పార్టీ అధి కారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా శనివారం ఉదయం కొద్దిసేపు నిలిచిపోయింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున తమ గొంతును అణచివేసే ప్రయత్నం జరిగిందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆరోపించారు. ఉదయం 6.16 గంటలకు ఖాతా తొలగించారని ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు.

- మిగతా 2లో

# చిన్న తప్పు కూడా పెద్ద నష్టం కలిగిస్తుంది

## ఇంటర్న్‌లకు నిర్మలా సీతారామన్ కీలక సందేశం

- ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ కింద పనిచేస్తున్న ఇంటర్న్‌లతో నిర్మలా సీతారామన్ సమావేశం
- ఏ పని చేసినా జాగ్రత్తగా, పరిపూర్ణంగా చేయాలని నిర్మల సూచన
- మనం చేసే తప్పు ఇతరులకు నష్టం కలిగించవచ్చన్న నిర్మల



- మిగతా 2లో

# అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రకృతి బీభత్సం..

## ఐదుగురు సైనికులు గల్లంతు

- అరుణాచల్ ప్రదేశ్‌లో రెండు వేర్వేరు విపత్తు ఘటనలు
- కొండచరియలు విరిగిపడి నలుగురు కూలీలు మృతి చెందినట్లు అనుమానం
- ఆకస్మిక వరదలో ఐదుగురు ఆర్మీ జవాన్లు గల్లంతు
- భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నష్టం



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### వత్తిడిలో సేనాని
### పవన్ పై పెరుగుతున్న భారం!

జనసేన పార్టీలో అంతా తానే అయి పవన్ కల్యాణ్ చూసుకోవాల్సి వస్తోంది. ఇది ఆయనకు శారీరకంగా, మానసికంగా వత్తిడికి గురి చేస్తుంది. పార్టీని గాడిలో పెట్టే మరో కీలక నేత లేకపోవడం జనసేనకు మైనస్ గా చెప్పాలి. జిల్లాల్లో, నియోజకవర్గాల్లో జనసేన నేతలు, కూటమి పార్టీలతో సయోధ్య లేక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం .. పవన్ కల్యాణ్ ఏ నిర్ణయమైనా తానే తీసుకోవాలని భావించడం వల్లనే. అది ఆయనకు మానసిక వత్తిడి తెస్తుందని చెబుతున్నారు. ఇందుకోసం ఒక కమిటీని నియమించి, వారి చేత జిల్లాల్లో నెలకొన్న విభేదాలను పరిష్కరించే బాధ్యతను అప్పగిస్తే చాలా వరకూ పవన్ కల్యాణ్ కు రిలీఫ్ గా ఉంటుందని ఆయన సన్నిహితులు అభిప్రాయపడుతున్నారు.

**ఏ ప్రాంతమయినా కావచ్చు...**

ఒంగోలు కావచ్చు.. నెల్లూరు కావచ్చు... మరో జిల్లా కావచ్చు.. జనసేన, టీడీపీ ల మధ్య, జనసేన నేతల మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఏదైనా ఆదిలోనే తుంచి వేస్తే ఎలాంటి రాజకీయ నష్టం జరగదు. కానీ చూసీ చూడనట్లు వ్యవహరించినా, ఒక ప్రకటన చేసి వదిలేసినా నేతల్లో పెద్దగా మార్పు రాదని చెబుతున్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలంటే ఒక కమిటీ జనసేనకు అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. వివాదం ప్రారంభయిన వెంటనే నిజానిజాలను అక్కడకు వెళ్లి కమిటీ పరిశీలించి స్థానిక నేతలతో మాట్లాడి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు నివేదిక ఇవ్వొచ్చు. కానీ ఆ పని గ్లాస్ పార్టీలో జరగడం లేదు. అంతా పవన్ కల్యాణ్ దగ్గరుండి, వివరాలను సేకరించి ఆదేశాలు జారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రెండేళ్లలోనే ఇలా ఉంటే...**

రెండేళ్లలోనే ఇంతగా పరిస్థితులుంటే.. రానున్న కాలంలో మరిన్ని వివాదాలు తలెత్తే అవకాశముంది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు అనేక కారణాలతో గొడవలు తారాస్థాయికి చేరుకునే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేరు. అలాగని అన్నీ పవన్ కల్యాణ్ దగ్గరుండి వాటిని పరిష్కరించాలంటే అది సాధ్యం కాదు. అందుకే కీలక, నమ్మకమైన నేతలతో ఒక కమిటీని నియమించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. నేరుగా పవన్ కల్యాణ్ ఎంట్రీ ఇచ్చి వివాదాలను పరిష్కరించాలని భావిస్తే మాత్రం అది అసాధ్యం.. ఆచరణ సాధ్యం కాదని జనసేన నేతలు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి సీనియర్ నేతలను కమిటీలో నియమించి వివాదాలు తలెత్తిన జిల్లాకు పంపితే కొంత వరకూ పవన్ కల్యాణ్ కూడా సానుకూలమైన నిర్ణయాలు తీసుకోవచ్చు. లేకుంటే సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటూ పార్టీకి ఇబ్బందులు తెస్తారని మాత్రం చెప్పొచ్చు.

## మనం అడ్రస్ లేనివాళ్లం కాదు..
## మన కేరాఫ్ అడ్రస్ అమరావతి

- మొదటి పేజి తరువాయి

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని మరోసారి స్పష్టం చేశారు. "ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. మనం అడ్రస్ లేని వాళ్లం కాదు.. మన కేరాఫ్ అడ్రస్ అమరావతి" అని ఆయన పునరుద్ఘాటించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం**

విద్యా వ్యవస్థలో తాము చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని గర్వంగా ప్రకటించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్లు, డొక్కా సీతమ్మ గారి పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో రాజకీయాలకు తావు లేకుండా చేశామని, పాఠ్యపుస్తకాలపై కానీ, పాఠశాలల వద్ద కానీ ఎక్కడా ముఖ్యమంత్రి లేదా తన ఫోటోలు ఉండవని స్పష్టం చేశారు. చరిత్రలో తొలిసారిగా, పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫోటోలతో ప్రకటనలు ఇచ్చామని గుర్తుచేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించినట్లు వెల్లడించారు.

**మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం**

లక్షలాది మంది త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని లోకేశ్ అన్నారు. మహాత్మా గాంధీ, నేతాజీ సుభాశ్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను ఎగురవేయడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. తన తాత, స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు మీద ఉన్న జిల్లాలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడం అరుదైన గౌరవమని తన వ్యక్తిగత ఆనందాన్ని పంచుకున్నారు. విజయవాడ నగరం విద్య, కళలకు నిజమైన రాజధాని అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అది మా గొంతును అణచివేసే ప్రయత్నమే

- మొదటి పేజి తరువాయి

6.45 గంటలకు ఖాతాను పునరుద్ధరించినట్లు మరో పోస్టులో తెలిపారు. ఇలాంటి చర్యలకు తాము భయపడమని దీప్కే పేర్కొన్నారు. తమను అడ్డుకోవాలనుకునేవారు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎంచుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగించడానికి ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. "స్కూల్ ఠీక్ కరో" ప్రారంభం దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఏ పార్టీ అధికారంలో ఉన్నా మారడం లేదని దీప్కే అన్నారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలోని తన సొంత గ్రామమైన సంతుక్ పింప్రీ నుంచి "స్కూల్ ఠీక్ కరో" (ఛ్ష్ట్రశీశీశ్రీ ఇ్ష్ట్రఱఅఎ ఖుఠీశీ) ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై తల్లిదండ్రులు, గ్రామస్థులు, సర్పంచ్‌లు సామాజిక తనిఖీలు చేసి నిలదీయాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. భారీ ప్రచారాలకు ఖర్చు చేసే డబ్బును గ్రామీణ పాఠశాలలు, విద్యార్థుల కోసం వెచ్చిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం కోసం తాము బృందాలను ఏర్పాటు చేశామని, వారు గ్రామాలను సందర్శించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు అవుతున్నా గ్రామీణ విద్యార్థులు పాఠశాలల్లో కనీస సౌకర్యాల కోసం ఇంకా ఎదురుచూసే పరిస్థితి ఉండకూడదని దీప్కే పేర్కొన్నారు.

## ట్వీట్లతోనో, స్పీచ్ లతోనే ఆక్రమించలేరు..

- మొదటి పేజి తరువాయి

ఈ వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ శాఖ అత్యంత ఘాటుగా స్పందించింది. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా మండిపడిన ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ గరీబాబాదీ, ఒక సోషల్ మీడియా ట్వీట్ ద్వారానో, యుద్ధనౌకలతో బెదిరించడం ద్వారానో లేదా ఎన్నికల ఉపన్యాసాలతోనో హర్మూజ్ జలసంధిని ఎవరూ ఆక్రమించలేరని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి ఇరాన్‌దేనని ఆయన తేల్చి చెప్పారు. ఇరాన్ విధించిన షరతులను అంగీకరించే వరకు జలసంధిని మూసివేయడం లేదా తెరవడం పూర్తిగా ఇరాన్ కమాండ్ నియంత్రణలోనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతానికి పైగా జరిగే ఈ వ్యూహాత్మక మార్గంలో అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలపై తీవ్ర ప్రభావం పడుతోంది.

# సప్తధార.. సంకల్పం

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. దేశం సరికొత్త సంకల్పంతో ముందుకు సాగుతోందని చెబుతూ, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక రోజున స్వాతంత్ర్య సమరయోధులకు, విప్లవకారులకు, మహాత్మా గాంధీకి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "ఇదొక చారిత్రాత్మక దినం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎర్రకోట ప్రాకారాల నుంచి 'వందేమాతరం' గీతం వినిపించడం ఇదే ప్రథమం. ఈ రోజు ప్రతి ఒక్కరి హృదయంలో వందేమాతరం ప్రతిధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో మువ్వన్నెల జెండా ఎగురుతోంది, ప్రతి మదిలోనూ త్రివర్ణ పతాకం నిలిచి ఉంది" అని అన్నారు.

దేశ ఆర్థిక ప్రగతిని వివరిస్తూ.. "ఒకప్పుడు మనల్ని 'ఫ్రాజైల్ ఫైవ్' (అతి బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థలు) దేశాల్లో ఒకటిగా లెక్కించేవారు. కానీ, కేవలం 12 ఏళ్లలోనే ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. గడిచిన 12 ఏళ్లుగా ప్రతి ఒక్కరూ దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపడానికి కృషి చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం భారత్ పెద్ద కలలే కన్నది, కానీ ఆశించిన వేగంతో ప్రగతి సాధించలేకపోయాం. ఈ రోజు భారత్ అపూర్వమైన వేగం, ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకెళతోంది. ఇప్పుడు 140 కోట్ల భారతీయుల సంకల్పాన్ని ఏ శక్తీ ఆపలేదు" అని మోదీ ఉద్ఘాటించారు. భవిష్యత్ లక్ష్యాలపై మాట్లాడుతూ.. "మన కలలు, సంకల్పాలు పెద్దవిగా ఉండాలి. అప్పుడే మన సామర్థ్యాలు ఉన్నత శిఖరాలకు చేరుతాయి. భారత్ సరికొత్త శిఖరాలను అధిరోహించడానికి పెద్ద కలలు కంటోంది. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందేలా నేను చూస్తాను. అత్యధిక జనాభా కలిగిన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారినప్పుడు, ప్రపంచం మనల్ని కచ్చితంగా భిన్నంగా చూస్తుంది" అని ప్రధాని పేర్కొన్నారు.

ఇటీవల దేశంలోని కొన్ని ప్రాంతాల్లో సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల నష్టపోయిన కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలనని, వారికి యావత్ దేశం అండగా నిలుస్తుందని ప్రధాని మోదీ భరోసా ఇచ్చారు.

**'సప్తధార'.. భారత్ అభివృద్ధికి మోదీ మాస్టర్‌ప్లాన్ ఇదే!**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ భవిష్యత్ అభివృద్ధికి కీలకమైన ఏడు రంగాలను 'శక్తి సప్తధార'గా అభివర్ణించారు. దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడంతో పాటు అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ఈ ఏడు శక్తులను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మోదీ.. తయారీ రంగం, రైతులు, సాంకేతికత, గతిశక్తి, రక్షణశక్తి, హరిత ఇంధనం, సాఫ్ట్ పవర్‌ను భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఈ రంగాల్లో వేగంగా ముందుకు సాగితే దేశ వృద్ధికి కొత్త దిశ ఏర్పడుతుందని చెప్పారు.

**1. తయారీ రంగం:** భారత్ భవిష్యత్ వృద్ధికి తయారీ రంగమే కీలకమని మోదీ అన్నారు. విడిభాగాలతో పాటు పూర్తి ఉత్పత్తులను దేశంలోనే తయారు చేయాలని సూచించారు. నాణ్యత, తక్కువ ఖర్చు, భారీ ఉత్పత్తితో ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలకంగా మారాలని పిలుపునిచ్చారు.

**2. రైతులు:** వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాలకు మరింత ఊతమివ్వాలని ప్రధాని చెప్పారు. భారత రైతులకు ప్రపంచ మార్కెట్లు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఎగుమతులను పెంచాలని సూచించారు. చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలను ప్రపంచ బ్రాండ్లుగా మార్చాలని అన్నారు.

**3. సాంకేతికత:** కొత్త సాంకేతికతలు, డేటా సెంటర్లు, రోబోటిక్స్‌లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఎదగాలని మోదీ ఆకాంక్షించారు. యూపీఐతో భారత సామర్థ్యం ప్రపంచానికి తెలిసిందని చెప్పారు. దేశంలో తయారైన 6జీ సాంకేతికతను దేశవ్యాప్తంగా విస్తరించాలని సూచించారు.

**4. గతిశక్తి:** దేశంలో రవాణా, అనుసంధాన వ్యవస్థలను మరింత వేగవంతం చేయాలని మోదీ అన్నారు. కొత్త రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మెరుగైన మౌలిక వసతులతో వ్యాపారాలకు మరింత ఊతం లభిస్తుందని చెప్పారు.

**5. రక్షణశక్తి:** రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశంలోనే రక్షణ పరికరాల తయారీని పెంచాలని సూచించారు. డ్రోన్లు, డ్రోన్ నిరోధక సాంకేతికతలపై పెట్టుబడులు పెంచాలని అన్నారు.

**6. హరిత ఇంధనం:** హరిత ఇంధన రంగాన్ని భారత్ అభివృద్ధికి కీలక శక్తిగా మోదీ పేర్కొన్నారు. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలకు పెద్దపీట వేయాలని సూచించారు. భవిష్యత్ ఇంధన అవసరాలను తీర్చేందుకు హరిత ఇంధనంపై దృష్టి పెట్టాలని అన్నారు.

**7. సాఫ్ట్ పవర్:** యోగా, హస్తకళలు, సినిమాలు, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్ భారత్ సాఫ్ట్ పవర్‌ను పెంచుతాయని మోదీ చెప్పారు. సృజనాత్మక రంగాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. పర్యాటక రంగంలోనూ భారత్‌కు ఉన్న అవకాశాలను మరింతగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

**నక్సలిజం అంతమైంది.. కానీ 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారు: మోదీ**

దేశంలో సాయుధ నక్సలిజం, మావోయిస్టు హింసను దాదాపుగా అంతం చేశామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అయితే మావోయిస్టు భావజాలం మాత్రం ఇంకా కొనసాగుతోందని హెచ్చరించారు. ఆ ఆలోచనా విధానంతో ఉన్న వారిని 'దిమాగీ నక్సల్స్'గా పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని, సమాజంలో హింస, అశాంతిని ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి దేశ ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అడవుల్లో సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించడంలో ప్రభుత్వం విజయం సాధించిందని ప్రధాని చెప్పారు. దశాబ్దాలుగా దేశాన్ని వేధించిన ఈ సమస్య నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని అన్నారు. అయితే సాయుధ నక్సల్స్ అంతమైనా వారి భావజాలం పూర్తిగా అంతం కాలేదని పేర్కొన్నారు. మావోయిస్టు ఆలోచనా విధానం ఉన్న కొందరు సంస్థలు, వ్యవస్థల్లోకి చొరబడి ప్రభావం చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిని గుర్తించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజే దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తి చేయాలని నిర్ణయించుకున్నామని మోదీ తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు నక్సలిజం దేశంలోని అనేక ప్రాంతాలను తీవ్రంగా ప్రభావితం చేసిందన్నారు. యువత, కుటుంబాలు, భద్రతా బలగాలు ఈ హింసతో తీవ్రంగా నష్టపోయాయని చెప్పారు. తుపాకీ భయంతో ప్రజలను బందీలుగా మార్చిన పరిస్థితులు ఉండేవని, రాజ్యాంగ వ్యవస్థను బలహీనపరిచేందుకు మావోయిస్టులు ప్రయత్నించారని ఆరోపించారు. ప్రస్తుతం నక్సలిజం చివరి దశలో ఉందని, పూర్తిగా నిర్మూలించే దిశగా వేగంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.

సాయుధ నక్సలిజంపై పోరాటంతోనే తమ పని పూర్తికాదని మోదీ స్పష్టం చేశారు. మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేసే వ్యక్తులు హింస, అరాచకాన్ని ప్రోత్సహించేందుకు వివిధ మార్గాలను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. సమాజాన్ని తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించే ఇలాంటి వారిని గుర్తించి ఒంటరి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా నక్సలిజం నిర్మూలనను ప్రశంసించారు. దశాబ్దాలుగా దేశానికి తీవ్ర సవాలుగా ఉన్న నక్సలిజాన్ని అంతం చేయడం గొప్ప విజయమని అన్నారు. గతంలో నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయని పేర్కొన్నారు. బస్తర్ ఒలింపిక్స్, బస్తర్ పండుగ వంటి కార్యక్రమాల్లో స్థానిక ప్రజల భాగస్వామ్యం పెరగడం మార్పునకు నిదర్శనమని తెలిపారు.

## వికాసం నుంచి వైభవం వైపు ఏపీ

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు మువ్వన్నెల జెండాను ఎగురవేసి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. రాష్ట్రాన్ని వికాసం నుంచి వైభవం వైపు, సుస్థిరత నుంచి స్వర్ణాంధ్ర దిశగా నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనకు ఐదున్నర కోట్ల మంది ఆంధ్రులు సంకల్పం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

"భారతీయులకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. దశాబ్దాల పోరాటం, ఎందరో మహనీయుల త్యాగఫలమే మన స్వాతంత్ర్యం. 80 ఏళ్ల క్రితం మన పెద్దలు కన్న కలలను సాకారం చేసి, 2047 నాటికి దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెడదాం. ఈ దేశానికి మనమేం ఇవ్వగలమని ఆలోచించడమే 'అనే నేను...' సంకల్పం. రాబోయే 20 ఏళ్లు దేశ భవిష్యత్తు కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేద్దాం. ప్రధాని మోదీ ఇచ్చిన వికసిత్ భారత్, మనం నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర లక్ష్యాలు వేర్వేరు కావు. ఐక్యంగా ఈ లక్ష్యాలను సాధిద్దాం" అని ముఖ్యమంత్రి ఉద్బోధించారు.

**గత పాలన విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని విధాలా విధ్వంసానికి గురైందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. "గత పాలకుల అహంకారం, అవినీతి, అరాచకాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునర్నిర్మాణ బాధ్యతను స్వీకరించాం. గత 26 నెలల్లో విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి స్థిరత్వం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనే మా లక్ష్యం. ప్రజల మద్దతు, కూటమి ఐక్యత, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి కొత్త ఊపిరి పోశాం" అని తెలిపారు. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ వంటి అన్ని అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. గత ప్రభుత్వ అప్పులను రీషెడ్యూల్ చేసి రూ.8,269 కోట్లు ఆదా చేశామని, రాష్ట్ర వృద్ధి రేటును 11.3 శాతానికి పెంచామని వివరించారు.

**పెట్టుబడుల వెల్లువ, ఉద్యోగాల కల్పన**

పారిశ్రామికవేత్తల్లో విశ్వాసం నింపేందుకు 28 కొత్త పారిశ్రామిక విధానాలు తీసుకొచ్చామని సీఎం తెలిపారు. "ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం. ఇప్పటికే రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదరగా, వాటిలో రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. తద్వారా 11 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, దాల్మియా సిమెంట్, హీరో, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి తరలివస్తున్నాయి. 36 రోజుల్లోనే ఆమ్కా డిఫెన్స్ ప్రాజెక్టుకు అనుమతులిచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను నిరూపించాం. యువత గ్లోబల్ లీడర్లుగా ఎదగాలి. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలు భర్తీ చేశాం. ఇకపై ఏటా డీఎస్సీ ఉంటుంది. ఇప్పటికే 10 వేల ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం" అని సీఎం పేర్కొన్నారు.

**వ్యవసాయం, సాగునీటి రంగాలకు పెద్దపీట**

'అన్నదాత సుఖీభవ' కింద ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు అందిస్తున్నామని, వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీని ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. "లక్ష కోట్లతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం. మదనపల్లెలో త్వరలో హార్టికల్చర్ యూనివర్సిటీకి శ్రీకారం చుడతాం. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తున్నాం. గత 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టులపై రూ.25 వేల కోట్లు ఖర్చు చేశాం. మరో మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశాం. 30 ఏళ్ల కల అయిన వెలిగొండ ఫేజ్–1ను త్వరలో ప్రారంభిస్తున్నాం. వంశధార–నాగావళి అనుసంధానం 73 శాతం పూర్తయింది. వచ్చే ఏడాది పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం" అని హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, సంక్షేమంలో సమతుల్యత**

రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని సీఎం వివరించారు. రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల రైల్వే పనులు, రూ.38 వేల కోట్ల హైవే పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఐదున్నర కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తామన్నారు. మహిళా సాధికారతకు 'స్వయం బ్రాండ్', పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చామని పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, నకిలీ మద్యంపై ఉక్కుపాదం వంటి చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రూ.30,849 కోట్ల బకాయిలు చెల్లించామని, ప్రజా భద్రతలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని స్పష్టం చేశారు. 'ఈగల్ టాస్క్ ఫోర్స్' ద్వారా గంజాయి, డ్రగ్స్‌ను అణిచివేస్తున్నామని తెలిపారు.

ఈ వేడుకల్లో భాగంగా ఏపీఎస్పీ, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళాలు, ఎన్‌సీసీ, స్కౌట్స్ విద్యార్థులు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. వ్యవసాయం, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో సాధించిన ప్రగతిని వివరిస్తూ వివిధ ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసు అధికారులకు, సిబ్బందికి ముఖ్యమంత్రి పతకాలను ప్రదానం చేశారు.

## లోక్ భవన్‌లో గవర్నర్ 'ఎట్ హోం'..

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్ భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులను గవర్నర్ అబ్దుల్ నజీర్, ఆయన అర్ధాంగి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్, ముఖ్యమంత్రి ఇరువురూ ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం గవర్నర్ దంపతులు ఆహ్వానితులకు తేనీటి విందు ఇచ్చారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ స్వయంగా ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి, స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సైనిక అధికారులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖుల రాకతో లోక్ భవన్ ప్రాంగణం పండుగ వాతావరణంలో సందడిగా మారింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం కొనసాగింది.

అనారోగ్యం కారణంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కాకినాడలో ఇవాళ స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ లో పాల్గొన్న అనంతరం పవన్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండడంతో, ఆయన ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొనడంలేదని జనసేన పార్టీ ఓ ప్రకటన విడుదల చేసింది.

## వికసిత్ భారత్ సంకల్పంలో ఏపీ తన పాత్ర పోషిస్తుంది

అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఒక తరం స్వాతంత్ర్యం కోసం పోరాడితే, మరో తరం దానిని కాపాడిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్' సంకల్పంలో ఏపీ కూడా తనదైన కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తామని భరోసా ఇచ్చారు. అంతకుముందు పవన్ కల్యాణ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్న తప్పు కూడా పెద్ద నష్టం కలిగిస్తుంది

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ (పీఎంఐఎస్) కింద పనిచేస్తున్న ఇంటర్న్‌లతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె యువతకు ముఖ్యమైన సందేశం ఇచ్చారు. "మీరు ఏ పని చేసినా జాగ్రత్తగా, పరిపూర్ణంగా చేయాలి. ఎందుకంటే చిన్న తప్పు కూడా వేరొకరికి తీవ్ర పరిణామాలు కలిగించవచ్చు" అని ఆమె చెప్పారు. మోటార్‌సైకిల్ తయారీలో ఒక చిన్న భాగంలో తప్పు జరిగితే, కొనుగోలు చేసిన వ్యక్తికి ప్రమాదం, నష్టం కలగవచ్చని ఉదాహరణగా చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో కూడా ఒక వెయ్యి రూపాయల బదులు లక్ష రూపాయలు పంపితే నష్టం ఎవరికి వస్తుందని ప్రశ్నించారు. డిజిటల్ సమాచారం నిర్వహణలో తప్పు జరిగితే కస్టమర్‌కు కొత్త సమస్యలు వస్తాయని హెచ్చరించారు. "మీరు నష్టపోరు, వేరొకరు భరించాల్సి వస్తుంది. కాబట్టి ప్రతి క్షణం పరిపూర్ణంగా పని చేయండి" అని ఆమె సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల నుంచి వచ్చిన ఇంటర్న్‌లు పరిశ్రమ అనుభవం, నైపుణ్యాలు సంపాదిస్తున్నారని నిర్మలా సీతారామన్ అభినందించారు. పీఎంఐఎస్ పథకం ద్వారా యువతకు భారత్‌లోని టాప్ 500 కంపెనీల్లో 12 నెలల హ్యాండ్స్–ఆన్ అనుభవం లభిస్తోందని, విద్యా–పరిశ్రమ మధ్య గ్యాప్‌ను తగ్గించడమే దీని లక్ష్యమని తెలిపారు.

### అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రకృతి బీభత్సం..
## ఐదుగురు సైనికులు గల్లంతు

అరుణాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. శుక్రవారం సాయంత్రం వేర్వేరు జిల్లాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఐదుగురు ఆర్మీ సిబ్బంది గల్లంతవగా, నలుగురు కూలీలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడమే ఈ దుర్ఘటనలకు ప్రధాన కారణం.

దిబాంగ్ వ్యాలీ జిల్లాలోని పసు పానీ ఆర్మీ క్యాంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షం కారణంగా వచ్చిన ఆకస్మిక వరద, 5వ గ్రెనేడియర్‌కు చెందిన రెండు షెల్టర్లను ముంచెత్తింది. ఈ వరద ఉద్ధృతిలో ఏడుగురు సైనికులు కొట్టుకుపోగా, వారిలో ఇద్దరిని సిబ్బంది సురక్షితంగా రక్షించారు. గల్లంతైన మరో ఐదుగురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు, అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో మరో దుర్ఘటన చోటుచేసుకుంది. కియోజరింగ్–బయాచింగ్ రహదారి నిర్మాణ పనుల వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ శిథిలాల కింద పలువురు చిక్కుకోగా, నలుగురు కార్మికులు మరణించి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. ఈ రెండు ఘటనల సమాచారం అందిన వెంటనే, సమీపంలోని పోస్టుల నుంచి సహాయక బృందాలు రంగంలోకి దిగి గాలింపు, సహాయక చర్యలు చేపట్టాయి.

## పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 15:** కాకినాడ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ (డీఐపీఆర్ఓ) కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐపీఆర్ఓ బి. పద్మజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో సమాచార పౌర సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్ఓ వి.వి. రామిరెడ్డి,పీఆర్ఓ ఎస్.అజయ్, ఏవీఎస్‌జి ధర్మరాజు,సీనియర్ అసిస్టెంట్ సురేష్, ఫోటోగ్రాఫర్ సీహెచ్.నరేష్ బాబు,వీడియోగ్రాఫర్ ఐ.నాగార్జున, కార్యాలయ సిబ్బంది కే.భారతి, జె. సతీష్,ప్రసాద్,లక్ష్మీకాంతం,గోపి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ఐసిడిఎస్ శంఖవరం సీడీపీవో వెంకటలక్ష్మికి ఉత్తమ సేవా పురస్కారం.....



**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 15:-** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కాకినాడ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన వేడుకల్లో ఐసిడిఎస్ శంఖవరం సీడీపీవో పర్వత వెంకటలక్ష్మికి ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో కాకినాడ జిల్లా కలెక్టర్ ఎన్ హరేంధిర ప్రసాద్,జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ,చిన్నారులు,గర్భిణులు,బాలింతలకు అందుతున్న సేవల పర్యవేక్షణ,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో వెంకటలక్ష్మి చూపిన సేవలను గుర్తించి ఈ పురస్కారం ప్రదానం చేశారు. అదేవిధంగా ప్రత్తిపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఏలూరు గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ కె శ్రీదేవి పద్మావతికి కూడా ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు.వెంకటలక్ష్మితో పాటు అంగన్వాడీ టీచర్ శ్రీదేవి పద్మావతిని కూడా అధికారులు అవార్డుతో సత్కరించారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడు సెక్టార్ సీడీపీవో పద్మావతి,అంగన్వాడీ సిబ్బంది వెంకటలక్ష్మి, శ్రీదేవి పద్మావతిని అభినందించారు.అంగన్వాడీ వ్యవస్థ ద్వారా చిన్నారులు, గర్భిణులు,బాలింతలకు మెరుగైన సేవలు అందించడంలో వీరిద్దరూ చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఉత్తమ సేవా పురస్కారాలు అందుకోవడం అంగన్వాడీ సిబ్బందికి మరింత స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

- జిల్లా కలెక్టర్,ఎస్పీ చేతులుల్ మీదుగా ప్రదానం.....
- అభినందనలు తెలిపిన ప్రత్తిపాడు సిడిపివో పద్మావతి



# కాకినాడ జిల్లాలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**కాకినాడ జిల్లా స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,ఆగస్టు 15:** కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా ప్రజలను ఉద్దేశించి స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇచ్చారు.ఉప ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్,ఎస్పీ జి. బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్,ట్రైనీ కలెక్టర్ ప్రియా తదితరులు స్వాగతం పలికారు.పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలకు సందేశం ఇచ్చారు.వేడుకల్లో భాగంగా పోలీసు జాగిలాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబించే శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. శకటాల ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులను, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్,ఎస్పీ జి.బిందు మాధవ్ అందజేశారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన 242 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను కలెక్టర్,ఎస్పీ చేతుల మీదుగా అందజేసి వారి సేవలను గుర్తించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా),లోక్‌సభ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్,రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు,ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం,కర్రి పద్మశ్రీ, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య, జగ్గంపేట ఎమ్మెల్యే,టీటీడీ పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు,కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ,రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, డీఆర్వో డాక్టర్ పి. తిప్పేనాయక్,కాకినాడ ఆర్డీవో మల్లిబాబు,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు,ప్రజలు పాల్గొన్నారు.
చివరగా వందేమాతరం గేయం,జాతీయ గీతాలాపనతో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిశాయి.



## వీబీజీ రామ్‌జీ పథకంలో గండేపల్లికి జిల్లా ప్రథమ స్థానం

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి అవార్డు అందుకున్న గండేపల్లి మండల బృందం

-4లో..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం







- శలపాకలో మాతా రమాభాయి
- ఎడ్యుకేషనల్ ట్రస్ట్
- ఘనంగా 8వ వార్షికోత్సవం నిర్వహణ

**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 15:** గ్రామీణ ప్రాంతాల్లోని పేద, వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిని ఉన్నత శిఖరాలకు చేర్చాలనే లక్ష్యంతో శలపాక గ్రామంలో ఏర్పాటు చేసిన మాతా రమాభాయి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఎనిమిదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.
గ్రామానికి చెందిన విద్యావంతులు, ఉద్యోగులు, జైభీమ్ యూత్ సభ్యులు సంఘటితమై మాతా రమాభాయి పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు కోచింగ్, మార్గదర్శకత్వం అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. గ్రామంలోని ప్రతి పిల్లవాడు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో కొనసాగుతున్న ట్రస్ట్ సేవలను పలువురు వక్తలు అభినందించారు.

నాటి గురువుల సేవలకు ఘన నివాళి

ఈ సందర్భంగా శలపాక గ్రామంలో విద్యకు పునాది వేసిన నాటి ఉపాధ్యాయుల సేవలను వక్తలు స్మరించుకున్నారు. శలపాక మెయిన్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేసిన, మాజీ సర్పంచ్ స్వర్గీయ దడాల గోవిందరావు మాస్టారు విద్యాబోధన, గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో పాటు విశిష్ట అతిథిగా హాజరైన రిటైర్డ్ ఉపాధ్యాయుడు రెడ్డి చంద్రరావు మాస్టారును గ్రామ పెద్దలు, ట్రస్ట్ సభ్యులు, ఆయన వద్ద విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు ఘనంగా సత్కరించి శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు.
రెడ్డి చంద్రరావు మాస్టారు మాట్లాడుతూ నాటి, నేటి విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులను వివరించారు. గతంలో గ్రామంలో చాలామంది వేలిముద్రలకే పరిమితమై ఉండేవారని, విద్యకు ప్రాధాన్యత పెరగడంతో ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుని గ్రామ అభివృద్ధికి తోడ్పడటం గర్వకారణమన్నారు.

పిల్లలకు విద్యతోపాటు మహనీయుల జీవితాలను పరిచయం చేయాలి

త్రిరత్న బుద్ధ విహార్ వ్యవస్థాపకులు పొలుగుమాటి నరసింహమూర్తి మాస్టారును కూడా గ్రామ పెద్దలు, జైభీమ్ యూత్ సభ్యులు సత్కరించారు.
ప్రత్యేక ఆహ్వానితురాలు, లైఫ్‌లైన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె. భానుమతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని తప్పనిసరిగా చదవాలని సూచించారు. మాతా రమాభాయి, సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు పూలే, అంబేద్కర్ వంటి మహనీయుల జీవిత చరిత్రలను పిల్లలకు పరిచయం చేయాలని కోరారు. తల్లే పిల్లలకు తొలి గురువని, తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యను అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు.
గ్రామంలో మాతా రమాభాయి ఎడ్యుకేషనల్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, తల్లిదండ్రులంతా తమ పిల్లలను ఈ కోచింగ్ సెంటర్‌కు పంపించి విద్యాపరంగా ముందుకు తీసుకెళ్లాలని ఆమె సూచించారు.

గ్రామాభివృద్ధిలో విద్యావంతుల పాత్ర కీలకం

ఎన్‌టీఆర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, న్యూరో సర్జన్ డాక్టర్ కె. బాబ్జీ మాట్లాడుతూ శలపాక గ్రామంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మాజీ సర్పంచ్ దడాల గోవిందరావు మాస్టారు పేదలకు అందించిన సేవలను కొనియాడారు. మండలంలో అంబేద్కర్ ఆలోచనా విధానానికి ప్రత్యేక గుర్తింపు ఉన్న గ్రామాల్లో దుగ్గుదూరు తరువాత శలపాక ముందంజలో ఉందని పేర్కొన్నారు.
గ్రామంలోని విద్యావంతులైన యువత సంఘటితమై రమాభాయి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడం అభినందనీయమని అన్నారు. యువత మద్యపానానికి దూరంగా ఉండాలని, విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

చదువే సమాజానికి గౌరవాన్ని తెస్తుంది

బీఎస్ఐ ప్రధాన కార్యదర్శి నేలపూడి పెద్దిరాజు మాట్లాడుతూ గ్రామంలో విద్యకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. చదువు మంచి నడవడికను, సమాజంలో గౌరవాన్ని పెంచుతుందని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యలో ముందుకు సాగాలని సూచించారు. “అమ్మ మాట నేర్పితే.. నాన్న నడక నేర్పుతాడు.. గురువు జీవిత మార్గం చూపుతాడు” అంటూ విద్యార్థులకు విద్య ప్రాధాన్యతను వివరించారు. ప్రతి విద్యార్థి కోచింగ్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంబేద్కర్ ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగాలి

ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ పీవీ రావు మాట్లాడుతూ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత విద్యాసంస్థల్లో దళిత విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. అంబేద్కర్ ఆలోచనా విధానం దేశ పురోగతికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌ను విద్యా ప్రయోజనాలకు వినియోగించాలని, యువత అనవసరమైన ఆన్‌లైన్ వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్య, వైద్య రంగాలకు గ్రామ ప్రజలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

ఎనిమిదేళ్ల సేవా ప్రస్థానానికి అభినందనలు

మాతా రమాభాయి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఎనిమిదేళ్లుగా విద్యార్థుల విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని సభాధ్యక్షులు మాత వెంకటేశ్వరరావుతో పాటు గ్రామ పెద్దలు, వక్తలు అభినందించారు. ట్రస్ట్ సేవలను మరింత విస్తరించి గ్రామంలోని ప్రతి విద్యార్థికి విద్యా అవకాశాలు అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో జియో కంపెనీ ఉద్యోగి హైదరాబాద్ రెడ్డి కృష్ణమోహన్, వీఆర్వో మారెల్ల శ్రీరాములు, కాసి చంద్రరావు, పోతురాజు ఏసురత్నం, జయమ్మ, దేవి, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్‌లు, జైభీమ్ యూత్ సభ్యులు, మాతా రమాభాయి కోచింగ్ సెంటర్ ట్యూషన్ టీచర్లు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ పథకంలో గండేపల్లికి జిల్లా ప్రథమ స్థానం

## 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి అవార్డు అందుకున్న గండేపల్లి మండల బృందం

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 15** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వీబీజీ రామ్‌జీ పథకం అమలులో గండేపల్లి మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శనివారం జిల్లా స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ చేతుల మీదుగా గండేపల్లి మండల బృందం జిల్లా స్థాయి అవార్డును అందుకుంది.

ఎంపీడీవో కె. హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో మండల బృందం పథకం అమలులో సమర్థవంతంగా పనిచేసినందుకు ఈ గుర్తింపు లభించింది. అవార్డు అందుకున్న సందర్భంగా మండల అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీఓ ఎం.ఆర్.కె. రాజు, సాంకేతిక అసిస్టెంట్లు శ్రీను, శ్రీనుబాబు, కంప్యూటర్ ఆపరేటర్ పద్మరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ జి. నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.



## మహనీయుల త్యాగఫలమే మన స్వాతంత్ర్యం





**కొత్తపేట, పెన్ పవర్,ఆగష్టు 15:**బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, ఎందరో మహనీయులు, త్యాగధనులు చేసిన పోరాటాలు, ప్రాణత్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వాడపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం, హైస్కూల్ వద్ద శనివారం నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా వాయువులు లక్షలాది మంది దేశభక్తుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ నిత్యం స్మరించుకోవాలని సూచించారు. నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి నేటి యువతలో ప్రతిబింబించాలని ఆకాంక్షించారు.యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగినప్పుడే దేశం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెంది ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అన్నవరం రత్నగిరిపై ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**అన్నవరం:పెన్ పవర్ ఆగస్ట్ 15**:ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం రత్నగిరి కొండపై 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి దేవస్థానం అనువంశిక ధర్మకర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ.వి. రోహిత్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనం సమర్పించారు. అనంతరం దేవస్థానం సాంస్కృతిక ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా చైర్మన్ ఐ.వి. రోహిత్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశాభివృద్ధితో పాటు ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.అనంతరం దేవస్థానం ప్రత్యేక భద్రతా దళం (ఎస్.పి.ఎఫ్. ) నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది, హోంగార్డులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది, వేద పాఠశాల విద్యార్థులు, వ్రత పురోహితులు, నాయి బ్రాహ్మణులు, దేవస్థానం ఉన్నత పాఠశాల విద్యార్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు, సిబ్బంది మరియు హాజరైన వారికి తీర్థప్రసాదాలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

# పూర్వ విద్యార్థుల విరాళాలు

**గండేపల్లి,పెన్ పవర్, ఆగస్టు 15:** గండేపల్లి మండలం నాయకంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి నృత్యాలు, దేశభక్తి గేయాలు, యోగా, ఫిజికల్ వ్యాయామ ప్రదర్శనలు, ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి అదే పాఠశాలలో గతంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు హాజరై విద్యార్థులను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తూ విరాళాలు అందజేశారు. పలువురు పూర్వ విద్యార్థులు నగదు విరాళాలతో పాటు విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించారు.

ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.పాఠశాలలో తాము విద్యనభ్యసించిన రోజులను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు అందించిన సహకారం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ పాఠశాల అభివృద్ధికి తమ సహకారం కొనసాగిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

## విద్యార్థులు వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి

**: డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు**



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 15:** లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యూత్ రెడ్‌క్రాస్ వింగ్ కంటింజెంట్ నుంచి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 79 ఏళ్ల స్వాతంత్ర్య ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకోవడం భారతీయులందరికీ గర్వకారణమన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, వీర జవాన్ల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని, అన్ని రంగాల్లో రాణించి భారతదేశాన్ని ప్రపంచ దేశాలకు తలమానికంగా నిలపాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో అద్భుత ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని,యువత నైపుణ్యవంతులుగా తయారై దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం, ఆరోగ్యకరమైన జీవన విధానం, లక్ష్య సాధనపై దృష్టి సారించడం ద్వారా యువత దేశానికి మరింత సేవ చేయగలదన్నారు. విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించడంలో అధ్యాపకులు కీలక పాత్ర పోషించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వింగ్ బృందాలను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ కె. కరుణ, డి. బ్యూలా, ఎం.డి. షాహిద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, జి. నాగ శ్రీకాంత్,గణేష్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు,డి. అశ్విని,ఎం.శ్రీనివాసరావు,సురేఖ, అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## చిన్ననాటి పాఠశాలలో
## ఆనందభాష్పాలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 15**: విద్యాభ్యాసం చేసిన చిన్ననాటి పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని విద్యార్థులతో ఆనందాన్ని పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాబు జగ్జీవన్ రావ్ యునైటెడ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు, చైర్మన్ డా. యార్లగడ్డ సురేష్ కుమార్ అన్నారు.రావులపాలెం మండలంలోని మండల ప్రజా పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. యార్లగడ్డ సురేష్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.తాను చిన్నతనంలో చదువుకున్న పాఠశాలలోనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం తనకు ఆనందభాష్పాలు తెప్పించిందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి వేడుకల్లో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. అనంతరం విద్యార్థులకు నోటుబుక్స్, తినుబండారాలను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డా. యార్లగడ్డ సురేష్ కుమార్ చిన్ననాటి స్నేహితులు మెరుపు నిరీక్షణ రావు, నేకూరి రాజేష్ కుమార్, దొండపాటి పనసయ్య మాస్టర్, వెల్ఫేర్ సొసైటీ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.చిన్ననాటి పాఠశాలలోనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహించిన డా. యార్లగడ్డ సురేష్ కుమార్‌ను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

## మహాత్మా గాంధీజీ ఆశయాలను నేటి తరం కొనసాగించాలి..

### ఉచ్చిలి జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు...

### వెత్సా అనిల్ కుమార్ ను అభినందించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు..





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 15:**మహాత్మా గాంధీజీ చెప్పిన మాటలు నేటికీ ఆచరణీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు.ఆత్రేయపురం మండలం ఉచ్చిలి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెత్సా అనిల్ తండ్రి వెత్సా సూర్యనారాయణ జ్ఞాపకార్థంగా నూతనంగా ఏర్పాటుచేసిన మహాత్మా గాంధీజీ విగ్రహావిష్కరణ చేసి పూల మాలలు సమర్పించారు. జాతిపిత పూజ్య బాపూజీ విగ్రహావిష్కరణ చేయడం 80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా తనకు కలిగిన అదృష్టంగా ఎమ్మెల్యే బండారు అభివర్ణించారు. 2026 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను సత్కరించి వారికి నగదు పురస్కారాలు అందజేశారు. కొత్తపేట మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ వెత్సా అనిల్ కుమార్ ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 558 మార్కులు సాధించిన కొల్లి బాబీకి రూ.10వేలు, 554 మార్కులు సాధించిన కె పృథ్వీ దుర్గ సూర్య తేజకు రూ.5వేలు, 528 మార్కులు సాధించిన మేకా వంశీ సాయి ప్రియాంకకు రూ.5వేలు, 521 మార్కులు సాధించిన అయినవిల్లి శ్రీదేవి కి రూ. 2వేలు, 504 మార్కులు సాధించిన మట్ట మౌనికకు రూ.2వేలు, 500 మార్కులు సాధించిన మట్టా జ్ఞానేశ్వరి ఐశ్వర్య దేవికి రూ.2వేలు అందజేశారు. అలాగే వారందరికీ కాలేజ్ బ్యాగ్, అవసరమైన విద్యా పరికరాలను అందజేశారు. విద్యార్థుల స్పోర్ట్స్ యూనిఫామ్ కోసం ఎమ్మెల్యే బండారు రూ.10 వేలు అందజేశారు.

## ఉత్తమ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా కప్పల సునీల్ కుమార్



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 15;**విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, సమర్థవంతమైన వాదనలతో నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేస్తున్న రామచంద్రపురం 13వ అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కప్పల సునీల్ కుమార్ కు ఉత్తమ అవార్డు లభించింది. శనివారం 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా అమలాపురం బాలయోగి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా,జాయింట్ కలెక్టర్ నదియాదేవి చేతుల మీదగా ఈ అవార్డును అందుకున్నారు.ఈ మేరకు ఆయనను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్త్రీశక్తితో మహిళలకు ప్రయాణ భారం దూరం





### రద్దీ వేళల్లో అదనపు సర్వీసులు కావాలంటున్న మహిళలు

**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 15:**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్త్రీశక్తి' పథకంతో కుటుంబాలపై రవాణా ఖర్చుల భారం గణనీయంగా తగ్గిందని మహిళలు పేర్కొన్నారు. పథకం అమలుకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శనివారం రావులపాలెంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణించి మహిళల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

క్షేత్రస్థాయిలో ఆరా


బస్సులో మహిళలతో కలిసి ప్రయాణించిన ఎమ్మెల్యే.. ఉచిత ప్రయాణం ఎవరెవరికి ఎంతమేర ఉపయోగపడుతోంది, ఏయే అవసరాల కోసం ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు, గతంలో ప్రయాణ ఖర్చుల కోసం ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యేవి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల నుంచి పట్టణాలకు పనులు, వైద్య సేవలు, మార్కెట్లు, కుటుంబ అవసరాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం వెళ్లే మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉందని వారు తెలిపారు.

రద్దీ వేళల్లో ఇబ్బందులు

ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో రాకపోకలు సులభమయ్యాయని మహిళలు చెబుతూనే.. రద్దీ వేళల్లో బస్సుల్లో చోటు దొరకడం కష్టంగా ఉంటోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన మార్గాల్లో అదనపు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల సమయంలో పట్టణాలకు వెళ్లే మహిళలకు అనుకూలంగా బస్సులు నడపాలని, గ్రామాల నుంచి ప్రధాన రహదారులకు చేరుకునే మార్గాల్లోనూ సర్వీసులు పెంచాలని విజ్ఞప్తి చేశారు.మహిళల సూచనలను పరిశీలించిన ఎమ్మెల్యే.. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో అదనపు బస్సులు, ప్రయాణికులకు అనుకూల సమయాల్లో సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

80 లక్షల మంది.. రూ.24.08 కోట్ల ప్రయోజనం

కొత్తపేట నియోజకవర్గంలోని రావులపాలెం డిపో పరిధిలో స్త్రీశక్తి పథకం ద్వారా సుమారు 80 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని ఎమ్మెల్యే తెలిపారు. వీటి విలువ సుమారు రూ.24.08 కోట్లుగా ఉందన్నారు. ఉచిత ప్రయాణంతో మహిళల కుటుంబాలపై రవాణా ఖర్చు తగ్గడంతోపాటు గ్రామీణ ప్రాంతాల మహిళలకు రాకపోకలు మరింత అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు.మహిళల నుంచి వస్తున్న సూచనలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మార్గాల్లో అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తే స్త్రీశక్తి పథకం మరింత ప్రయోజనకరంగా మారుతుందని బండారు సత్యానందరావు అన్నారు. మహిళలు స్వతంత్రంగా తమ పనులు చక్కబెట్టుకునేందుకు, ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఈ పథకం దోహదపడుతోందని పేర్కొన్నారు.




## కస్టమ్ హైరింగ్ సెంటర్లతో రైతులపై సాగు భారం తగ్గింపు

**రైతులకు ఆధునిక పరికరాలు అద్దెకు.. త్వరలో ఆలమూరు, కొత్తపేటలోనూ కేంద్రాలు**





**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 15 :** వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించి రైతుల సాగు ఖర్చులను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రావులపాలెం మండలంలో ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు.

చిన్న, సన్నకారు రైతులు ట్రాక్టర్లు, రోటావేటర్లు, వీడర్లు, డ్రోన్లు వంటి ఆధునిక వ్యవసాయ పరికరాలను సొంతంగా సమకూర్చుకోవడం ఆర్థికంగా భారమవుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు అవసరమైన యంత్రాలను అద్దె ప్రాతిపదికన, మార్కెట్ ధరల కంటే తక్కువకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కస్టమ్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు.

ఈ కేంద్రాల ద్వారా రైతులు తమ అవసరానికి అనుగుణంగా ట్రాక్టర్లు, రోటావేటర్లు, వీడర్లు తదితర పరికరాలను గంటల ప్రాతిపదికన కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు (ఎఫ్‌పీవోలు) రైతుల అవసరాలను సమన్వయం చేస్తూ యంత్రాల వినియోగాన్ని పర్యవేక్షిస్తాయని చెప్పారు.

డ్రోన్లతో వేగంగా.. తక్కువ ఖర్చుతో

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరగడం వల్ల పంటలకు అవసరమైన పిచికారీ వంటి పనులను తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పూర్తి చేసే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కూలీలతో చేయాల్సిన పనులకు ఎక్కువ సమయం, వ్యయం అయ్యే పరిస్థితిలో డ్రోన్ల ద్వారా వేగంగా పనులు పూర్తి చేసి పంటలను సకాలంలో సంరక్షించుకోవచ్చన్నారు. డ్రోన్ల నిర్వహణ ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. రైతులందరూ కస్టమ్ హైరింగ్ సెంటర్లను సద్వినియోగం చేసుకుని సాగు ఖర్చులను తగ్గించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న పరికరాలు, వాటి వినియోగ విధానం, అద్దె ధరలపై గ్రామస్థాయిలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఆలమూరు, కొత్తపేటలోనూ కేంద్రాలు

జిల్లాకు మంజూరైన ఐదు కస్టమ్ హైరింగ్ సెంటర్లలో రెండు రావులపాలెం, ఆత్రేయపురం ప్రాంతాలకు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయం అధికంగా జరిగే ఆలమూరు, కొత్తపేట ప్రాంతాల్లోనూ కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రైతులకు ఉపయోగపడే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆయన అభినందించారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు





- **22 జట్లు.. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు**
- **క్రీడలకు కుల, మత, ప్రాంత భేదాలు లేవు.. గ్రామీణ ప్రతిభకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 15**80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలి రామకృష్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రా స్పోర్ట్స్ అసోసియేషన్, స్టేట్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. సుమారు 22 జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం రోజున క్రీడా పోటీలను నిర్వహించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా యువతలో దేశభక్తితో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

క్రీడా మైదానంలో అందరూ సమానమే

క్రీడలకు కులం, మతం, భాష, ప్రాంతం, రంగు వంటి భేదాలు ఉండవని నిర్వాహకులు అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడైనా.. గ్రామీణ ప్రాంతంలోని సాధారణ కుటుంబం నుంచి వచ్చిన క్రీడాకారుడైనా మైదానంలో అడుగుపెట్టిన తర్వాత అందరూ సమానమేనని పేర్కొన్నారు. క్రీడలు జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలుస్తాయని, భిన్న ప్రాంతాలు, భాషలకు చెందిన క్రీడాకారులు ఒకే వేదికపై పోటీపడటం దేశ ఐక్యతకు నిదర్శనమన్నారు.

గ్రామీణ ప్రతిభకు వేదిక

గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు లభిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే సామర్థ్యం ఉందని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు క్రీడల ద్వారా జాతీయ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగగలడని అన్నారు. యువతకు ఇలాంటి అవకాశాలను అందించే రంగాల్లో క్రీడలు కీలకమని పేర్కొన్నారు.

కబడ్డీ మన దేశీయ క్రీడ అని, మన సంప్రదాయ క్రీడకు మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో దేశభక్తితో పాటు క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని తెలిపారు.

రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు అభినందనీయుడేనని పేర్కొన్నారు. పరస్పరం గౌరవించుకుంటూ స్నేహపూర్వక వాతావరణంలో పోటీలను కొనసాగించాలని కోరారు.

పోటీల నిర్వహణకు సహకరించిన నిర్వాహకులకు క్రీడాభిమానులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్య స్ఫూర్తి, జాతీయ సమైక్యత, క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబించేలా జరుగుతున్న ఈ పోటీలు విజయవంతంగా పూర్తికావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, కాయల జగన్నాథరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గుడిలో నాగేంద్ర గౌడ్, జగన్మోహిని కేశవస్వామి ఆలయ ఈవో ద్వారపురెడ్డి సురేష్‌బాబు, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, మద్దూరి సుబ్బారావు, పాలింగి రవిచంద్ర, నామాల ఏసు, మద్దూరి రామకృష్ణ, కూటమి నాయకులు, క్రీడాభిమానులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఎంపీడీఓ అవార్డు అందుకున్న కిర్లంపూడి ఎంపీడీఓ బాయిశెట్టి హరికృష్ణ.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు,15:** జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీడీఓగా కిర్లంపూడి మండలం ఎంపీడీఓ బాయిశెట్టి హరికృష్ణ ఎంపిక అవ్వడమే కాకుండా, శనివారం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కిర్లంపూడి మండలంలో బాయిశెట్టి హరికృష్ణ అందించిన విశిష్ట సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ ఎంపీడీఓ గా ఎంపిక చేయడం పట్ల హరికృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తమ ఎంపీడీఓ గా ఎంపికైన బాయిశెట్టి హరికృష్ణను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, ఎంపీపీ తోట రవి, జడ్పిటిసి తోట గాంధీ, ఎం ఈ ఓ లు,టి జోసెఫ్, మక్కా చిన్నారావు,తహసీల్దార్,కె సాయికిరణ్, ఏపీఓ, నాయుడు, ఏపిఎం,శరకణం వేదకుమారి, డిప్యూటీ ఎంపిడిఓ ఎస్ వి సుబ్బారావు, సూపరింటెండెంట్ ప్రసాద్,మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ,మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు,జనసేన నాయకులు గంధం ప్రభాకర్ మండలంలోని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికైన హరికృష్ణకు అభినందనలు తెలియజేశారు.ు

## పదో తరగతి ప్రతిభావంతులకు బాపనమ్మ చారిటబుల్ ట్రస్ట్ బహుమతులు



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 15**:మండలం అంకంపాలెం గ్రామంలోని కె.వి.ఆర్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బాపనమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.పదో తరగతి పరీక్షల్లో 579 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన మోటూరి లక్ష్మి దుర్గా భవానికి ల్యాప్‌టాప్, హెడ్‌ఫోన్స్‌ను బహుమతిగా అందజేశారు. 568 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన పిల్లి జితేంద్రకు రూ.7,500 నగదు బహుమతి, 560 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన యడ్ల కనకదుర్గకు రూ.7,500 నగదు బహుమతిని అందించారు.ఈ సందర్భంగా బాపనమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కరుటూరి నరసింహారావు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. విద్యార్థులను చిన్ననాటి నుంచే ప్రోత్సహించడం ద్వారా వారు మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి బాపనమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున భవిష్యత్తులోనూ ప్రోత్సాహం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించారు.

# వీబీజీ రామ్‌జీ పథకంలో గండేపల్లికి జిల్లా ప్రథమ స్థానం

**80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి అవార్డు అందుకున్న గండేపల్లి మండల బృందం**

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వీబీజీ రామ్‌జీ పథకం అమలులో గండేపల్లి మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శనివారం జిల్లా స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ చేతుల మీదుగా గండేపల్లి మండల బృందం జిల్లా స్థాయి అవార్డును అందుకుంది.

ఎంపీడీవో కె. హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో మండల బృందం పథకం అమలులో సమర్థవంతంగా పనిచేసినందుకు ఈ గుర్తింపు లభించింది. అవార్డు అందుకున్న సందర్భంగా మండల అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీఓ ఎం.ఆర్.కె. రాజు, సాంకేతిక అసిస్టెంట్లు శ్రీను, శ్రీనుబాబు, కంప్యూటర్ ఆపరేటర్ పద్మరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ జి. నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.



## ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 15**: కాకినాడ జిల్లా మండల కేంద్రమైన ప్రత్తిపాడు లో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడమే కాకుండా, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.స్థానిక లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్ నందు స్వాతంత్ర దినోత్సవ వేడుకలు లయన్ క్లబ్ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించడమే కాకుండా,స్థానిక సెయింట్ జోసెఫ్ ఆలంబన వసతి గృహంలో ఉన్న హెచ్ఐవి ప్రభావిత కుటుంబాల పిల్లలు,వలస కార్మికుల కుటుంబాల పిల్లలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. లయన్ ఇంధన యేసుబాబు ఆర్థిక సౌజన్యంతో, క్లబ్ ప్రెసిడెంట్ లయన్ ఇంజనీర్ బి చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ రమేష్ రాజు, సెక్రటరీ లయన్ డాక్టర్ ఎం కిరణ్,లయన్ ట్రెజరర్ చలంకూరి కృష్ణమూర్తి , లయన్ గోపి రాజు, లయన్ రెడ్డి నాయుడు, లయన్ ఫకీర్ రాజు, లయన్ ఫకీర్ రాజు, లయన్ గొంప రామకృష్ణ , లయన్ నక్క అప్పారావు,లయన్ కె సంజీవరావు, ఆర్ సి ఎం హాస్పిటల్ సూపరిడెంట్ సిస్టర్ సంజులా పలువురు సిబ్బంది పాల్గొన్నారు

## వాడపల్లి క్షేత్ర అభివృద్ధికి కృషి చేసిన ఆలయ ఉప కమిషనర్ ఎన్ ఎస్ చక్రధర్ రావు కు ఉత్తమ సేవా పురస్కారం



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 15:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోనే ప్రత్యేక ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకుంటోంది. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందించేందుకు కృషి చేస్తున్న ఆలయ ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావుకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు.ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో ఉప కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు చేస్తున్న కృషిని అధికారులు అభినందించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన, సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నల్ల సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ.. వాడపల్లి క్షేత్రంలో భక్తులకు మెరుగైన సేవలు అందించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న అధికారులు, సిబ్బంది, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

## ఆదిత్య యూనివర్సిటీ లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 15:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందేమాతరం తో ప్రారంభమైన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి,ప్రో. వైస్ ఛాన్సలర్స్ . డా. ఎ. రమేష్, డా. రవి తంగజం, రిజిస్ట్రార్ డా. జి.సురేష్, డీన్. డా. డి.కిషోర్, డీన్. స్కూల్ ఆఫ్ ఫార్మసి డా. డి. సతీష్ కుమార్,పోలిటెక్నిక్ ప్రిన్సిపాల్. ఎస్ టి వి ఎస్ కుమార్, హాస్టల్ ఇంచార్జ్ జి. హరీష్ రెడ్డి,చక్రవర్తి, డా. విజయ్ రెడ్డి, సరిత,ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ఎందరో మహానుభావులు కృషి ఫలితమే నేటి ఈ స్వాతంత్ర్యము అని వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల దేశభక్తి గీతాలు ఎంతో ఆకట్టుకున్నాయి.. ఎన్.సి.సి. మరియు యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది వందన సమర్పణ కావించగా విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమం అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు.

## నర్సిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు "తేజోసూర్య" చారిటబుల్ ట్రస్ట్ బహుకరించిన కంప్యూటర్ల ప్రారంభం



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 15;**నర్సిపూడి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలకు "తేజోసూర్య" చారిటబుల్ ట్రస్ట్ బహుకరించిన మూడు కంప్యూటర్లను స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీ శనివారం నాడు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సమక్షంలో ప్రారంభించారు. పాఠశాలలో నిర్వహించిన 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎంఈఓ 2 ఎన్ రాజు ఆదేశాలతో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు డి రవి జనార్ధన రావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ఎస్ఎంసి చైర్మన్ ఉండమట్ల కుసుమారావు పతాకావిష్కరణ చేశారు. 2026 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 500 మార్కులు దాటిన 11 మంది విద్యార్థినులు ఒక్కొక్కరికీ రూ.1,116ల చొప్పున పలువురు దాతలు అందించిన నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దునే స్వామి నాయుడు, రాయుడు వెంకటస్వామి, ఉండమట్ల బాలాజీ, ఉండమట్ల దుర్గాప్రసాద్, వడ్డి దొరయ్య నాయుడు, పురపాకల రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఎందరో అమరవీరుల త్యాగఫలమే నేటి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.



-ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, ఆగస్టు, 15**, ఎందరో అమరవీరుల త్యాగఫలమే నేటి స్వాతంత్ర దినోత్సవ వేడుకలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా అన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం మండల కేంద్రమైన ప్రత్తిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యప్రభరాజా ముఖ్య అతిథిగా పాల్గొని జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించడమే కాకుండా,జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ,విద్యార్థులకు స్వతంత్ర సమర యోధుల త్యాగాలను విపులంగా వివరించారు. అనంతరం బాలబాలికలకు స్వీట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలోఎంపీడీఓ, ఎం.వి.ఆర్ కుమార్ బాబు, ఎంఈఓ రాజబాబు, ఏఓ సత్యనారాయణమూర్తి, ఏపిఎం,వై వెంకట్ ,జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త మేడిశెట్టి బాబి,సీబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్, సి హెచ్ సి వర్కింగ్ కమిటీ చైర్మన్ వెలుగుల నాని, బొల్లు కొండబాబు, యర్రా బత్తుల గోవిందనాయుడు, ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, మండలంలోని పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు

## ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే నేటి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.




-ప్రముఖ న్యాయవాది కొల్లా వీర్రాజు.

**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 15:** ఎందరో మహానుభావుల త్యాగ ఫలితమే నేటి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామని ప్రముఖ న్యాయవాది కొల్లా వీర్రాజు అన్నారు. 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో ఉన్న ఎస్ ఎల్ వి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రముఖ న్యాయవాది కొల్లా వీర్రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా వందనం కార్యక్రమం చేసారు. ఈ సందర్భంగా కొల్లా వీర్రాజు మాట్లాడుతూ నేటి విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరస్పాండెంట్ కొల్లా సత్య సరస్వతి, సెక్రటరీ కొల్లా సూరిబాబు, పాఠశాల వ్యవస్థాపకులు తిబిరిశెట్టి వేంకటేశ్వర రావు,పాఠశాల హెచ్ ఎం మల్లికార్జున రావు,సీనియర్ బిజెపి సింగిలీదేవి సత్తిరాజు ఆఫీస్ ఇంచార్జి గొడే శేఖర్ తదితరులు పాల్గొని, స్వాతంత్ర పోరాటంలో పోరాట యోధుల గురించి, అమరవీరుల త్యాగాల గురించి విద్యార్థులకు విపులంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్య క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు!

## పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు.



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 15;**మండలంలోని జొన్నాడ గ్రామంలో శ్రీ ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శనివారం 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక నాయకులు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహానుబావుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. దేశానికి త్యాగమూర్తుల చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివన్నారు. అనంతరం గ్రామానికి చెందిన గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబీ) ప్రోత్సాహంతో గొడవర్తి సత్యనారాయణమూర్తి(జిఎస్ఎన్ మూర్తి) సహకారంతో ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాలలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ.6000, ద్వితీయ బహుమతిగా రూ.5000 తృతీయ బహుమతిగా రూ.4000 అందజేశారు. అలాగే గ్రామ మాజీ సర్పంచ్ కట్టా శ్రీనివాస్ పదో తరగతిలో ప్రతిభ కనబరిచి 500 మార్కులకు పైగా సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 2000 చొప్పున నగదును అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను) ఆర్థిక సహకారంతో మెమెంటోళ్లను అందించి విద్యార్థులను అభినందించారు. చివరగా ఫిజికల్ డైరెక్టర్ (పిడి) లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన హ్యూమన్ పిరమిడ్స్ కవాతు చూపకులను ప్రత్యేకంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణ రెడ్డి (దొరబాబు), సొసైటీ చైర్మన్ మేడపాటి రామారెడ్డి, నామాల సూరిబాబు, విద్యా కమిటీ చైర్మన్ మెర్ల శ్రీనివాస్ చౌదరి, చింతలపూడి శ్రీనివాస్, తాడి సత్యనారాయణ రెడ్డి, కట్టా రామకృష్ణ, మిద్దె పురుషోత్తం, తదితరులు పాల్గొని అభినందించారు.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న కిర్లంపూడి తహసీల్దార్ కె సాయికిరణ్,

**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు,15:** కిర్లంపూడి తహసీల్దార్, కె సాయికిరణ్ జిల్లా స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక అవ్వడమే కాకుండా, శనివారం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కిర్లంపూడి మండలంలో కె సాయికిరణ్ అందించిన విశిష్ట సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ తహసీల్దార్ గా ఎంపిక చేయడం పట్ల సాయికిరణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న కె సాయికిరణ్ ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, ఎంపీపీ తోట రవి, జడ్పిటిసి తోట గాంధీ, ఎం ఈ ఓ లు,టి జోసెఫ్, మక్కా చిన్నారావు,తహసీల్దార్,కె సాయికిరణ్, ఏపీఓ, నాయుడు, ఏపిఎం,శరకణం వేదకుమారి, డిప్యూటీ ఎంపిడిఓ ఎస్ వి సుబ్బారావు, సూపరింటెండెంట్ ప్రసాద్,మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ,మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు,జనసేన నాయకులు గంధం ప్రభాకర్ మండలంలోని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికైన హరికృష్ణకు అభినందనలు తెలియజేశారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# శ్రీ కోటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 15:** కాజులూరు శ్రీ కోటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పాఠశాల చైర్మన్ డాక్టర్ దేగల నాగేంద్ర అధ్యక్షతన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా బంధనపూడి మాజీ సర్పంచ్ దేగల తిరుమలవేణి, దేగల సత్యనారాయణ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తుకు ప్రతినిధులని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధులు కన్న కలలను సాకారం చేసే బాధ్యత నేటి తరంపై ఉందన్నారు.పాఠశాల ప్రిన్సిపల్ అమజాల సత్యదుర్గ మాట్లాడుతూ భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, దువ్వూరి సుబ్బమ్మ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి మహనీయులు, వీరనారుల త్యాగం, ధైర్యం, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి ఆశయాలను గౌరవిస్తూ ప్రతి విద్యార్థి దేశ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. "దేశం మనకు ఏమిచ్చిందని కాకుండా, దేశానికి మనం ఏమి చేయగలం?" అనే ఆలోచనతో విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు.వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, పిరమిడ్లు విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కాదా కోటేశ్వరరావు, పీటీ సూర్యపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఎన్టీరాజపురం దోకుబుర్ర సుబ్బారావుకు డాక్టరేట్



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 15:** కాకినాడ జిల్లా గండేపల్లి మండలం ఎన్టీరాజపురం గ్రామానికి చెందిన దోకుబుర్ర సుబ్బారావు డాక్టరేట్ పట్టా సాధించారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే తెలుగు సాహిత్యంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందడం విశేషంగా నిలిచింది.

ఉపాధ్యాయుడిగా సేవలు.. పరిశోధకుడిగా గుర్తింపు

ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సుబ్బారావు 'గుంటూరు కథా సంకలనం -- ఒక పరిశీలన' అనే అంశంపై సమగ్ర పరిశోధన చేపట్టారు. ఆయన సమర్పించిన పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని పరిశీలించిన అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టాకు ఆమోదం తెలిపింది. అనంతరం విశ్వవిద్యాలయం తరఫున ఆయనకు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు.

తెలుగు సాహిత్యానికి మరింత సేవ చేయాలి

ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ సాధించడం పట్ల పలువురు సుబ్బారావును అభినందించారు. విద్యార్థుల్లో తెలుగు భాష, సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, తన పరిశోధన ద్వారా తెలుగు సాహిత్య రంగానికి సేవ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

గ్రామస్తుల హర్షం

సుబ్బారావు డాక్టరేట్ సాధించడంపై ఎన్టీరాజపురం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో తెలుగు సాహిత్య రంగంలో మరిన్ని పరిశోధనలు చేపట్టి, తెలుగు భాషాభివృద్ధికి తనవంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## వాడపల్లి రథోత్సవ దురంతానికి 95 ఏళ్లు.. త్యాగమూర్తులకు ఘన నివాళి





**జాతీయ పతాకాన్ని ఎగరవేసిన వాడపల్లి చైర్మన్ ముదునూరు వెంకటరాజు**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 15:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రానికి ఘనమైన చారిత్రక నేపథ్యం ఉంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో జరిగిన వాడపల్లి రథోత్సవ ఘటనను స్మరించుకుంటూ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. 1931 మార్చి 30న చైత్ర శుద్ధ ఏకాదశి సందర్భంగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం జరిగింది. దేశవ్యాప్తంగా మహాత్మా గాంధీ పిలుపుతో శాసనోల్లంఘన ఉద్యమం కొనసాగుతున్న సమయంలో స్థానిక స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు భక్తితో పాటు దేశభక్తిని చాటుతూ స్వామివారి రథంపై జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేసి, మహాత్మా గాంధీ తదితర జాతీయ నాయకుల చిత్రపటాలను ఉంచినట్లు స్థానిక చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి.

రథోత్సవంలో భక్తులు గోవింద నామస్మరణతో పాటు వందేమాతరం, మహాత్మా గాంధీకి జై అంటూ నినాదాలు చేస్తూ రథాన్ని లాగుతున్న సమయంలో బ్రిటిష్ పాలనా యంత్రాంగం జాతీయ పతాకం, నాయకుల చిత్రపటాల ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు చెబుతారు. అనంతరం పోలీసులు లాఠీఛార్జి, కాల్పులకు పాల్పడటంతో పలువురు గాయపడి, కొందరు ప్రాణాలు కోల్పోయినట్లు చారిత్రక వృత్తాంతాలు పేర్కొంటున్నాయి. ఈ ఘటనను స్థానికంగా 'వాడపల్లి రథోత్సవ జరిగినప్పుడు స్మరించుకుంటున్నారు.

ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ధర్మకర్త మండలి సభ్యులతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసి, స్వాతంత్ర్య సమరయోధులు, ఆనాటి త్యాగమూర్తులకు ఘనంగా నివాళులర్పించారు. చారిత్రక నేపథ్యం కలిగిన వాడపల్లి క్షేత్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని ఆయన పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందనం అనంతరం పాల్గొన్న వారికి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసిన తలపంటి బుజ్జి....






- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం...
- పలుచోట్ల స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బుజ్జి.....
- బుజ్జిని సేవలను గుర్తించి శాలువాతో సత్కరించిన తహసీల్దార్..

**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 15:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని నెల్లిపూడి టి అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి పాల్గొన్నారు.జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గత మూడేళ్లుగా కొనసాగిస్తున్న ఆనవాయితీ ప్రకారం నగదు పురస్కారాలు అందించారు. ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలకు వరుసగా రూ.5 వేలు,రూ.3 వేలు,రూ.2 వేల చొప్పున అందజేశారు.గత ఏడాది,ఈ ఏడాది ప్రతిభ చూపిన విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న బుజ్జిని తహసీల్దార్ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు ఘన సత్కారం



**గండేపల్లి,పెన్ పవర్ ,ఆగస్టు 15:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విధి నిర్వహణలో ప్రతిభ, నిబద్ధత, ప్రజలకు మెరుగైన సేవలు అందించిన వారిని గుర్తించి ఈ పురస్కారాలు అందించినట్లు అధికారులు తెలిపారు. జెడ్ రాగంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి పనులు, కుళాయి పనులు నిబద్ధతతో వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శి తరంగిణికి జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ చేతుల మీదగా అవార్డు అందజేశారు. పోలీసు అధికారులు, ఇతర అధికారులు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సేవాభావంతో పనిచేసిన వారిని సత్కరించడం ద్వారా ఇతర సిబ్బందికి స్ఫూర్తి కలుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.




## ప్రత్తిపాడు సి ఐ,బి సూర్య అప్పారావుకు ఉత్తమ సేవా పురస్కారం

- కలెక్టర్ ఎన్ హరేంధిర ప్రసాద్,ఎస్పీ జి బిందుమాధవ్ చేతుల మీదుగా ప్రదానం



**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు, 15:**80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి సూర్య అప్పారావుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ సేవా పతకాన్ని ప్రకటించింది.విధి నిర్వహణలో చూపిన ప్రతిభ,అంకితభావం,సమర్ధవంతమైన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయనకు ఈ ప్రతిష్ఠాత్మక పతకాన్ని ప్రదానం చేసింది.2026 ఆగస్టు 15 న కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో కాకినాడ జిల్లా కలెక్టర్ ఎన్ హరేంధిర ప్రసాద్,జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ చేతుల మీదుగా సీఐ బి సూర్య అప్పారావు సేవా పతకాన్ని అందుకున్నారు.విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినందుకు సేవా పతకం లభించడం పట్ల సీఐ,సూర్య అప్పారావు ఆనందం వ్యక్తం చేశారు, సేవ పురస్కారం అందుకున్న సి ఐ,అప్పారావుకు ప్రత్తిపాడు ఎస్సై, ఎస్ లక్ష్మీకాంతం,పోలీస్ అధికారులు,సిబ్బంది అభినందనలు తెలిపారు

## ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 15** దాకా స్థానిక సూరంపాలెంలోని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులచే "వందేమాతరం" గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభమయింది.

ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ డా॥ పరుచూరి కృష్ణారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలాపించారు. తదుపరి జరిగిన కార్యక్రమంలో ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల ఎన్.సి.సి., ఎన్ ఎస్ ఎస్ మరియు కళాశాలల వివిధ క్లబ్ల విద్యార్థులు కవాతు నిర్వహించారు.

ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డా॥ పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ, కళాశాల సిబ్బందికి, విద్యార్థినీ, విద్యార్థులకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేస్తూ, ఈ వేడుకలలో కవాతు నిర్వహించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. అనంతరం భారతదేశం ఎంతో నాగరికత కలిగిన దేశం అని, ప్రేమ సౌభ్రాతృత్వాలు, మానవతా విలువలు కలిగినదని, ప్రపంచ దేశాలన్ని కూడా యుద్ధ వాతావరణంతో నిండిన వేళ, మన దేశం శాంతికి ప్రతిరూపంగా నిలుస్తూ, ఇతర దేశాలకు తమ సహాయసహాకారాలు అందిస్తూ, మానవతా విలువలను చాటుతుందని పేర్కొన్నారు. ఎందరో త్యాగధనుల కృషి ఫలితంగా లభించిన స్వాతంత్ర్యాన్ని సమర్ధవంతంగా వినియోగించుకుంటూ, దేశంలోని వివిధ రంగాలలో పురోగతి సాధిస్తూ, అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడేవిధంగా నేటి యువత స్ఫూర్తిగా నిలవాలని తెలియజేసారు.

తదనంతరం జరిగిన ఒక కార్యక్రమంలో కళాశాల నిర్వహణ మరియు అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కళాశాల సిబ్బందిని సన్మానిస్తూ కళాశాలకు 15 సంవత్సరాలు మరియు 10 సంవత్సరాల కాలం పాటు విశేష సేవలందించిన సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలను అందించారు. అంతేకాక కళాశాల అకడమిక్స్లో అత్యుత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రధానం జరిగింది.

ఈ కార్యక్రమంలో డైరక్టర్ మేనేజ్మెంట్ శ్రీ ఎం.వి. హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎమ్. సతీష్, డైరక్టర్-అకడమిక్స్ డా॥ కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా॥ జి.నరేష్, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు, కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్

## విద్యార్థుల భవిష్యత్తుకు అండగా గవిరెడ్డి గురునాథ్....

- పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటితే రూ.5 వేలు నగదు నజరానా....
- ఎ మల్లవరం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రకటన



**శంఖవరం /రౌతులపూడి పెన్ పవర్ ఆగష్టు 15:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం
రౌతులపూడి మండలం ఎ మల్లవరం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన ప్రత్తిపాడు నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు,కాకినాడ పార్లమెంట్ ఎక్స్ అఫిషియో సభ్యుడు గవిరెడ్డి గురునాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవిరెడ్డి గురునాథ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.
ఎ. మల్లవరం గురుకుల పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.5 వేల నగదు బహుమతిని అందజేస్తానని ప్రకటించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు తనవంతుగా ఈ నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## స్వాతంత్ర్య సమర యోధుల సేవలు స్మరించుకుందాం

- రెపరెపడలాడిన మువ్వన్నెల జాతీయ పతకాలు
- వాడవాడలా ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 15;**దేశ స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ పోరాటం చేసి బ్రిటీష్ పాలకుల బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించిన స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకుందామని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వాడవాడలా 80వ భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆలమూరు ఎంపీపీ కార్యాలయం ఆవరణలోను, పెదపళ్ల, చొప్పెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఎంపీపీ లక్ష్మణరావు, జడ్పీటీసీ సీతామహాలక్ష్మి పాల్గొని జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. స్థానికజూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కె.కుశరాజు, ఎంపీడీఏ ఏ రాజు చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వద్ద ఎం.సుదీప్తి, చొప్పెల్ల పీహెచ్‌సీ వద్ద ఎన్.లక్ష్మీస్నేహ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల వద్ద మండల కేంద్రమైన ఆలమూరులో వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ సీహెచ్‌కెవి.చౌదరి, ఏఓ బి.మీనా, పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్సై జి.నరేష్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ ఎస్ఎస్.స్వర్ణకుమారి, సబ్ ట్రెజరీ, వెలుగు, మండల విద్యాశాఖ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. అలాగే మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల వద్ద ప్రత్యేక అధికారులు, ఎంపీటీసీలు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొని పతాక ఆవిష్కరణ చేశారు. ఆలమూరులోని సమతా స్వచ్ఛంద సంస్థ, పినపళ్లలో శ్రీకృష్ణ ప్రభాస్ పేపరుమిల్లు ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి.

## విధి నిర్వహణలో ప్రతిభకు గుర్తింపు.



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 15;**మండలంలోని చొప్పెల్ల గ్రామానికి చెందిన సుంకర కృష్ణమూర్తికి విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు ప్రశంసా పత్రం లభించింది. దేవరపల్లి పశు వైద్యశాలలో అటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన 2025-26 సంవత్సరంలో విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు, అంకితభావానికి గుర్తింపుగా ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా కృష్ణమూర్తి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు గుర్తింపు లభించడంపై చొప్పెల్ల గ్రామస్తులు, పలువురు ఆయనను అభినందించారు.

# కాజులూరు మండలంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**కాజులూరు, పెన్‌పవర్, ఆగస్టు 15:** కాజులూరు మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, సొసైటీ కార్యాలయాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు జాతీయ పతాకాలను ఆవిష్కరించి దేశభక్తి చాటుకున్నారు.
గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌బీ సుశీలామణి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముర్రే శివశంకర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల 2000--01 మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.20 వేల విలువైన ప్రోత్సాహక బహుమతులను విద్యార్థులకు అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కోకా హరి, నక్కా శ్రీను, సొసైటీ డైరెక్టర్ దేగల సుబ్బారావు, చౌదరి, సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ, శలపాక సాగునీటి సంఘం అధ్యక్షుడు తాడి రామారెడ్డి, దేవు గోవిందరావు తదితరులు స్వీట్లు పంపిణీ చేశారు.
కోలంక సొసైటీ కార్యాలయంలో చైర్మన్ బొండా వెంకట నరసింహ నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈవో రామన్న, మారెళ్ల నాగేశ్వరరావు,దూడల రామగంగారావు, మామిడి జిలాని, బొండా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. కోలంక వింగ్స్ స్కూల్లో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బొండా వెంకన్న త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.
తణుకువాడ సొసైటీ కార్యాలయంలో చైర్మన్ పితాని సతీష్‌కుమార్ జెండా వందనం నిర్వహించారు. సొసైటీ డైరెక్టర్లు సలాది వీరభద్రరావు (బద్రి), పోతురాజు అప్పారావు తదితరులు పాల్గొన్నారు. పాఠశాల, పంచాయతీ ఆవరణలో ఏఎంసీ డైరెక్టర్, టీడీపీ సీనియర్ నాయకుడు వల్లు అర్జునరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.
శలపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి పి. సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పాఠశాలలోనూ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జెండా వందనం జరిగింది. మాజీ సర్పంచులు పోతుల గనిరాజు, పోతురాజు భీమారావు,ఎంపీటీసీ దడాల రమేష్, దడాల కృష్ణారెడ్డి, పోతురాజు రాంప్రసాద్, దడాల త్రిమూర్తులు, పొట్లకాయల నాగేశ్వరరావు, పులగల రత్నకుమార్ తదితరులు పాల్గొని విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.
గొల్లపాలెం సొసైటీ కార్యాలయంలో చైర్మన్ అంగర కృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, జాతీయ సమైక్యతా స్ఫూర్తిని ప్రతిబింబించేలా సాగాయి.




## కిర్లంపూడిలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

ముివ్వన్నెల జెండాలతో కళకళలాడిన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు.



**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు, 15:**కిర్లంపూడి మండలంలో గ్రామ గ్రామాన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత ఉత్సాహంగా,ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు వేడుకల్లో పాల్గొని దేశభక్తిని చాటారు.
మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో, తహసీల్దార్ కె సాయికిరణ్,మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి, పోలీస్ స్టేషన్,లో ఎస్ ఐ, జి సతీష్,వ్యవసాయ శాఖ,ఏఓ నాగం సుధామాధురి,విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఓలు, టి జోషఫ్, మక్కా చిన్నారావు,ప్రాధిమిక ఆరోగ్య కేంద్రంలో గౌతు చిన్న,పంచాయతీ కార్యాలయాల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళు లర్పించారు. దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ



వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు, ప్రముఖులు పిలుపునిచ్చారు. మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

## ఉత్తమ సేవలకు ఏ.డి.ఈ.ఈ చిట్టిరాజుకు అవార్డు



**కొత్తపేట, పెన్ పవర్, ఆగస్టు 15:** విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు కొత్తపేట (ఏ.డీ.ఈ.ఈ) డి. చిట్టిరాజుకు జిల్లా కలెక్టర్, ఎస్పీ, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ డి. చిట్టిరాజుకు అవార్డు అందజేశారు. విధి నిర్వహణలో అంకితభావం, వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడం, విద్యుత్ సరఫరా సంబంధిత సమస్యలపై సత్వర స్పందన వంటి అంశాలను గుర్తించి ఈ పురస్కారం అందజేసినట్లు తెలిపారు.అవార్డు అందుకున్న సందర్భంగా చిట్టిరాజు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డుతో సత్కరించడం ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందన్నారు. ఈ పురస్కారం తన ఒక్కరి కృషి ఫలితం కాదని, విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అందించిన సహకారం వల్లే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు.వినియోగదారులకు నిరంతరాయంగా మెరుగైన సేవలు అందించడం విద్యుత్ శాఖ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, సాంకేతిక సమస్యలు, కొత్త కనెక్షన్లు, లైన్ సంబంధిత సమస్యలు తదితర అంశాలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.
విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తన తోటి ఉద్యోగులు, సిబ్బంది అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని, భవిష్యత్తులోనూ వారి సహకారంతో శాఖకు మరింత మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తానని చిట్టిరాజు తెలిపారు.ప్రజలకు విద్యుత్ సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవడం, వినియోగదారులతో మరింత మెరుగైన సమన్వయం కొనసాగించడం తన బాధ్యతగా తీసుకుని ముందుకు సాగుతానని ఆయన స్పష్టం చేశారు.
విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలకు లభించిన ఈ అవార్డు చిట్టిరాజు సేవలకు గుర్తింపుగా నిలిచిందని తోటి ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

# తెలుగు మీడియం,గ్రామీణ నేపథ్యం విద్యార్థుల ఎదుగుదలకు అడ్డంకి కాదు..

**-- ఎన్ఆర్ఐ డాక్టర్ మేకల నాగేశ్వరరావు**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు, 15:** తెలుగు మీడియం, గ్రామీణ నేపథ్యం, విద్యార్థుల ఎదుగుదలకు ఎంత మాత్రం అడ్డంకి కాదని ఎన్నారై డాక్టర్ మేకల నాగేశ్వరరావు అన్నారు.ప్రత్తిపాడు మండలం లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇదే పాఠశాలలో 1997-98లో చదువుకుని, కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేసి ప్రస్తుతం అమెరికాలో స్థిరపడిన ఎన్ఆర్ఐ డాక్టర్ మేకల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.
?తాను చదువుకున్న పాఠశాల మట్టిలోనే తన భవిష్యత్తుకు బలమైన పునాది పడిందని ఆయన గుర్తు చేసుకున్నారు. తెలుగు మీడియం, గ్రామీణ నేపథ్యం విద్యార్థుల ఎదుగుదలకు ఎంతమాత్రం అడ్డంకి కాదని, కష్టపడి చదివితే అమెరికానే కాదు అంతరిక్షాన్ని సైతం చేరుకోవచ్చని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపారు. చదువు ఒక్కటే జీవితాన్ని మార్చే సాధనమని, కులమతాల కంటే మంచి గుణమే గొప్పదని గురజాడ మాటలను స్మరించారు. మొబైల్ ఫోన్‌లను కాలక్షేపానికి కాకుండా జ్ఞానాన్ని పెంచుకోవడానికి మాత్రమే వాడాలని సూచించారు. దేశానికి అసలైన బలం యువతేనని, తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని కోరారు.
?ఈ కార్యక్రమంలో ఎన్నారై పావనికుమారి గొన్నాబత్తుల, పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి. వాణిప్రభ, చక్కపల్లి మందీశ్వరరావు, పందినవీన్, గంటా విష్ణు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఏపీఎస్పీ 3వ పటాలం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 15: కాకినాడ జిల్లా 3వ పటాలం ఏపీఎస్పీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులుగా కమాండెంట్ కె. నవీన్ కుమార్,పద్మ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా కమాండెంట్ కె.నవీన్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటాన్ని, దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు.గత 80 ఏళ్లలో విద్య, వ్యవసాయం,అంతరిక్షం, క్రీడలు,శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశం స్వయం సమృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోందన్నారు.

2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో నేటి విద్యార్థుల పాత్ర కీలకమని కమాండెంట్ పేర్కొన్నారు. విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. పెద్దలను గౌరవిస్తూ సమాజం, ప్రకృతి, సంస్కృతి, భాషలు, వివిధ వర్గాలను గౌరవించాలని పిలుపునిచ్చారు. దేశం పట్ల ప్రేమ, బాధ్యత, గౌరవ భావన ప్రతి విద్యార్థిలో ఉండాలని అన్నారు.నేటి విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తని,వారు విద్యావంతులుగా, నైపుణ్యవంతులుగా,బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. వికసిత్ భారత్ కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదని, ప్రతి భారతీయుడి సమిష్టి బాధ్యత, కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 2047 నాటికి బలమైన, విద్యావంతమైన, స్వయం సమృద్ధి, సమగ్ర, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.వేడుకల్లో భాగంగా వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్. దేవానందరావు,అసిస్టెంట్ కమాండెంట్లు జి.ఎస్.చంద్రశేఖరరావు,ఎస్. మన్మథరావు, పాఠశాల ప్రిన్సిపాల్, హెడ్‌మాస్టర్, విద్యార్థులు, తల్లిదండ్రులు,పాఠశాల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు




గంగవరం, పెన్ పవర్ ,ఆగస్టు 15: 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలోనూ హనుమాన్ ఆటో యూనియన్ వద్ద తహసిల్దార్ సిహెచ్ శ్రీనివాసరావు ,మండల పరిషత్ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎంపీపీ కృష్ణారెడ్డి, జడ్పిటిసి బేబీ రత్నం ,పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ వీర్రాజు తదితరులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అలాగే దొర మామిడి సచివాలయంలో మండల వ్యవసాయ అధికారి కె విశ్వనాథ్ గంగవరం సచివాలయంలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ కె గోపీనాథ్ ,మర్రిపాలెం పంచాయతీలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ విశ్వనాథ్, మొల్లేరు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో చైర్పర్సన్ పాము అర్జున పలు పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎంసి చైర్మన్లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వతంత్ర ఉద్యమం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, మాజీ సర్పంచులు కలుముల అక్కమ్మ ,బుల్లియమ్మ ,వెంకటేశ్వర్లు, కూటమి నాయకులు కే సిద్దు ,సత్యవేణి, పావని, పీసా ఉపాధ్యక్ష కార్యదర్శులు శివరామకృష్ణ, చిన్ని బాబు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ స్టేడియం వద్ద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 15: స్థానిక మున్సిపల్ స్టేడియం వద్ద శ్రీనివాస్ యాదవ్, వియ్యపు సతీష్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్యాపురం అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించా రు.ఈ సందర్భంగా చల్లా శంకర్రావు మాట్లాడుతూ దేశంలో యువత మంచి మార్గంలో పయనిస్తూ దేశ అభివృద్ధికి వారి వంతు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. యువతలో దేశభక్తి, సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కింతాడ భూలోకేశ్వరరావు ల, టి, శ్రీనివాస్ యాదవ్, వియ్యపు సతీష్, వియ్యపు కిట్టి, హరి , బత్తిన విజయ్ కుమార్, శ్రీకృష్ణ యాదవ్ సంఘం అధ్యక్షులు జానా కేశవ్, పట్నాల అంజిబాబు, బొట్టా వీరబాబు, గౌరవ అధ్యక్షులు, నొడగల సుద, అశోక్, తురాల చిన్నారావు, అల్లు సత్యబాబు, యునియాడ్స్ శ్రీను, శివ, రాజా కోటేశ్వరరావు పిల్లి శ్యామ్,పడాల శ్రీసు, నీలపాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఆర్ఎంసి అధికారులు, ఉద్యోగులకు సేవా పురస్కారాలు



రాజమహేంద్రవరం పెన్ పవర్, ఆగస్టు 15: స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నీటి సంరక్షణ, లిక్విడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ పై నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఆర్ఎంసికి చెందిన 59 మంది ఉత్తమ అధికారులు, ఉద్యోగులకు మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అవార్డులను ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో అడిషినల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జి.వి.ఎస్. ఎన్.మూర్తి, ఎంహెచ్ఓ ఎ.వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, అకౌంటెంట్ ఆర్.నాగమణి, సీఎంఎం వి.రామలక్ష్మి, ఈఈలు ఎం.వి.కె.మాధవి, మదర్షా అలీ, డిప్యూటీ సిటీ ప్లానర్ పి.నాయుడు, ఇతర ఆర్ఎంసి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రజా సేవకు గుర్తింపుగా ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగి అవార్డులు

-కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు



కూనవరం,పెన్ పవర్,ఆగస్టు15. ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందించినందుకు కూనవరం మండలానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగి ప్రశంసా అవార్డులు అందుకున్నారు.80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగి అవార్డులను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తాసిల్దార్ ధర్మేందర్,డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథ రావు,జూనియర్ అసిస్టెంట్ చక్రి,చూచిరేవుల గూడెం గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్, ఉత్తమ ఆరోగ్య మిత్ర సర్వేశ్వరరావు వీరి సేవలను కొనియాడి అవార్డులు అందజేశారు.ప్రభుత్వ పథకాల అమలులో,ప్రజలకుఅందుబాటులో ఉంటూ సేవలు అందించినందుకు వీరిని ప్రభుత్వం గుర్తించింది.ఈ సందర్భంగా మండల ప్రజలు,ప్రజా ప్రతినిధులు అవార్డు గ్రహీతలను అభినందించారు.

# పేదలకు అండగా సీఎం సహాయ నిధి

17 కుటుంబాలకు రూ.13.44 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, ఆగస్టు 15: ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. శనివారం రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి 17 మంది బాధిత కుటుంబాలకు మొత్తం రూ.13,44,471 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అనారోగ్యంతో బాధపడుతూ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన సహాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.సీఎంఆర్ఎఫ్ సాయంతో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందుల నుంచి బయటపడుతున్నామని లబ్ధిదారులు తెలిపారు. సకాలంలో ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.చెక్కులు అందుకున్న వారిలో ఎటపాక మండలానికి చెందిన చేకూరి దుర్గచౌదరి, మాదినేని బానుశ్రీ, గాదెసుల మంగ; కూనవరం మండలానికి చెందిన బెల్లం శ్యామ్‌సుందర్, ఇర్పాని వెంకటలక్ష్మి, బల్ల సరోజిని, ఆబూరి లక్ష్మి; రంపచోడవరం మండలానికి చెందిన సూరిశెట్టి కృష్ణ, సుజ్జల మంగారత్నం, కుంజం గంగరాజు; వై.రామవరం మండలానికి చెందిన ముచ్చర్ల సూరిరాజు; గంగవరం మండలానికి చెందిన చంద్ర సూర్యకుమార్ దొర, మంగార మారుమ్మ; దేవీపట్నం మండలానికి చెందిన మడి బొజ్జమ్మ, తాతపూడి అక్కమ్మ; అడ్డతీగల మండలానికి చెందిన గంటా కాంతకుమారి; రాజవొమ్మంగి మండలానికి చెందిన యెల్లా లక్ష్మణుడు ఉన్నారు.కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, సొసైటీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ముప్పన కేశవ, నియోజకవర్గ మహిళా విభాగం ప్రతినిధి ముప్పన సావిత్రి, గంగవరం మండల పార్టీ అధ్యక్షుడు పల్లాల వెంకటరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కనిగిరి సుబ్బారావు, దేవీపట్నం మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ల చంటిబాబు, ప్రధాన కార్యదర్శి కీర్తి గంగాధర్, ఐటీడీపీ ప్రతినిధి కుటుంబరెడ్డి, మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు పురస్కారాలు






గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 15:80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మండలంలో విశిష్ట సేవలందించిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు శనివారం రంపచోడవరం లో జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సేవా పురస్కారాలను అందజేశారు. గంగవరం పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్స్ పుండరీనాథ్ రాంబాబు జగదీష్ అలాగే మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు కు సేవా పురస్కారాలు లభించాయి. వారు ప్రజలకు అందజేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి, శాసనసభ్యురాలు శిరీష దేవి, జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఓ ఎస్ డి జవాలీ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కారాలను అందజేశారు. ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న వారిని ఎంపీపీ కృష్ణారెడ్డి, జడ్పిటిసి బేబీ రత్నం, మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ ,జనసేన అధ్యక్షుడు సిద్దు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వర్లు, తాసిల్దార్ శ్రీనివాస్ ,మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్ ,అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్ గజేంద్ర కుమార్ ,ఎస్సై వెంకయ్య పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

## దేశభక్తి, క్రమశిక్షణ, నిష్పక్షపాతంతో విధులు నిర్వర్తించాలి

: ఎస్పీ బిందు మాధవ్



కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 15: దేశభక్తి, క్రమశిక్షణ, నీతి, నిజాయితీ, నిష్పక్షపాత వైఖరితో పోలీసులు విధులు నిర్వర్తించాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, సూచించారు.80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ జి. బిందు మాధవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ప్రతి పౌరుడికి బాధ్యత ఉందని తెలిపారు. దేశభక్తి ఒక్కరోజుకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో బాధ్యతాయుతమైన ప్రవర్తనలో ప్రతిబింబించాలని సూచించారు.పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ దేశసేవను గౌరవంగా భావించి ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో నీతి,నిజాయితీ, క్రమశిక్షణ, నిష్పక్షపాత వైఖరి, దృఢ సంకల్పం ఎంతో ముఖ్యమన్నారు. ప్రజలకు న్యాయం జరిగేలా చూడటమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.అన్యాయం,అక్రమం, నేరాలను నిర్భయంగా ఎదుర్కొని చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, ప్రజలతో మర్యాదగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యలను సానుభూతితో విని, చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని తెలిపారు.స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్న బలమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.యువత దేశ భవిష్యత్తుకు పునాదులని, దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ ఏఆర్ ఎస్. శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి.సత్యనారాయణ, డీటీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాసరావు, పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ ఎ. సన్యాసిరావు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ డి. దుర్గా శేఖర్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కార్యాలయ పరిపాలనాధికారి ఎం.వి.వి. సత్యనారాయణ మూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టాల్స్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



కాకినాడ పెన్ పవర్, ఆగస్టు 15: కాకినాడ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాల స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న కిర్లంపూడి తహసీల్దార్ కె సాయికిరణ్,



కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు,15: కిర్లంపూడి తహసీల్దార్, కె సాయికిరణ్ జిల్లా స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక అవ్వడమే కాకుండా, శనివారం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కిర్లంపూడి మండలంలో కె సాయికిరణ్ అందించిన విశిష్ట సేవలను గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ తహసీల్దార్ గా ఎంపిక చేయడం పట్ల సాయికిరణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న కె సాయికిరణ్ ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, ఎంపీపీ తోట రవి, జడ్పిటిసి తోట గాంధీ, ఎం ఈ ఓ లు,టి జోసెఫ్, మక్కా చిన్నారావు,తహసీల్దార్,కె సాయికిరణ్, ఏపీఓ, నాయుడు, ఏపిఎం,శరకణం వేదకుమారి, డిప్యూటీ ఎంపిడిఓ ఎస్ వి సుబ్బారావు, సూపరింటెండెంట్ ప్రసాద్,మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ,మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు,జనసేన నాయకులు గంధం ప్రభాకర్ మండలంలోని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు ఉత్తమ ఎంపీడీఓగా ఎంపికైన హరికృష్ణకు అభినందనలు తెలియజేశారు.